# బలిదానం

నవల

- పాలగుమ్మి రామకృష్ణారావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 74

కౌముది మాసపత్రికలో

జనవరి 2012 నుంచి సెప్టెంబర్ 2012

వరకు సీరియల్‌గా వచ్చిన నవల

**పొద్దుగుంకింది. అప్పటి వరకు ప్రతాపం చూపిన సూరన్న,** మొహాన్ని కొలిమిలో మంటపెట్టిన ఇనుప రేకులా ఎర్రగా చేసుకుని మబ్బుల చాటునుండి దగ్గరకు మేత కోసమో కాళ్ళతీత కోసమో తోలుకుపోయిన బర్రెల్ని గ్రామంలోకి మలుపుకొచ్చారు పాలెగాండ్లు. నర్సిరెడ్డి ఇంటికి ఎడం పక్కనున్న షెడ్డు కనపడగానే బర్రెలు హుషారొచ్చినట్టుగా అడుగులు వేగం చేస్తే, గిట్టలు లయబద్ధంగా చప్పుళ్ళు చేసాయి. కాలి గిట్టల మధ్యనుండి పైకి లేచిన దుమ్ము కూడా ఎర్రగా మెరుస్తూ సూరీడుకు అద్దం పట్టినట్లయ్యింది.

చౌరస్తా దగ్గర పోరగాళ్ళు ఒకళ్ళు నల్లాను కొడుతోంటే మరొకళ్ళు తలకాయ గొట్టం కింద పెట్టి నీళ్ళు పోసుకుంటున్నారు. తెల్ల మచ్చల బర్రె నల్లా లోంచి కారే నీళ్ళను చూడగానే దాహం వేసి, బోర జాచి అటు మళ్ళింది. దాని వెంబడే దూడ, మరో రెండు దున్నలు ఆ దోవే పట్టాయి. మిగిలినవి రోడ్డుకడ్డంగా నిలబడిపోయాయి.

"ఎహె. టిర్ టిర్. నీ యవ్వ ఏందే నల్లా కాడికి ఉరుకుతున్నావు? ఇంటికొచ్చినాక దాహతైందా! చల్" పాలెగాడు చెమ్కీతో మక్కెమీదొకటిచ్చాడు. మచ్చల బర్రె బెదిరి ముందరి కాళ్ళు పెకెత్తి పక్కకు జరిగింది. మొత్తం అన్నీ ఒకదాన్నొకటి తోసుకున్నాయి. అప్పుడే వెనకనుండి జీప్ హారన్ భొయ్ మంది. అన్ని బర్రెలు మరోసారి బెదురుతో తోసుకున్నాయి. పాలెగాండ్లు ఇద్దరు చెరో పక్కకు జరిగి బర్రెలు పక్క గల్లీలోకి చొరబడకుండా రోడ్డుమధ్యకు తోలారు. జీపు హారను ఆగలేదు. హారను మోతకు, కాపలా వాళ్ళ కర్రల దెబ్బలకు బర్రెలు అంబా అంటూ అరుపులు మొదలు పెట్టాయి.

డ్రైవరు తల బయిటకు పెట్టి వాటికి పోటీగా అరిచాడు "ఏందిరా ఆ తోలడం? ఏంది కత? ఊర్ల జీపిల్ని పోనీరా?"

పాలెగాండ్లు వెనకకు చూసారు. అది పోలీస్ జీపు. డ్రైవరుకు దగ్గరగా ఉన్న కుర్రాడు జీపు మీద చెయ్యేసి

"నీ బాంచెన్ కాల్మొక్కుతా దొరా. గదే మా నర్సిరెడ్డి దొరిల్లు. గాడికి తోలుకు పోతున్నాం. జర మీ హారనిని బర్రెలు బెదిరినాయి. ఎహెయ్ చల్ చల్" అంటూ జీవాల్ని అదిలించాడు.

డ్రైవరుకు పక్క సీటులో కూర్చున్న ఎస్.ఐ. "నువ్విటా" అని పిలిచాడు.

పోరడు ఒక్క సెకనులో ఉరుక్కుంటూ జీపుకు రెండో పక్కకు చేరాడు.

"నీ పేరేందిరా?"

"పాండ్రయ్య దొరా"

"ఊ. ఏడ్నుంటావు?"

"ఈడ్నే దొరా. మా దొర బర్రెల షెడ్డుకానుకుని గుడిసేసినాం. ఆడ్నే పండతాం, ఆడ్నే బర్రెల్ని కాపుకాస్తాం."

"సర్లే గానీ ఈడ్న గణేష్ ఇల్లెక్కడ?"

"గణేషన్న ఊర్ల లేడు. పట్నంలో చదువుకుంటున్నాడు."

"అరే బద్మాష్గా నేనడింగిందానికి చెప్పరా. గణేష్ ఇల్లెక్కడ?"

"గింట్ల ఎవులల్లేరు. ఆల్లమ్మ ఎగుసం పనికి పోయింది."

"ఊ. ఇల్లేడుందో చెప్పినావు కాదు. ఒరేయ్ నిన్ను లగాయిస్తాను."

"ఈ పక్క గల్లీ కడాకంటే ఓతే వస్తది. రావి చెట్టున్నదీ. ఆడ."

"ఉరుకు. ఇల్లు చూపినాక బర్రెల్ని తోలుకో." డ్రయివరు జీపును గల్లీలోకి మలిపాడు.

పాండ్రయ్య జీపుముందు పరుగెట్టాడు. రెండు నిముషాల్లో రావి చెట్టొచ్చింది. "గిదే దొరా ఇల్లు" రొప్పుతో చూపించాడు పాండ్రయ్య. అది రెండుగదుల చిన్న రేకుల షెడ్డు. ఎస్సై జీపు దిగి ఇంటి ముందుకు వచ్చాడు. తలుపు తాళం వేసుంది. తలుపు చెక్క

వదులుగా పైనా, ప్రక్కనా ఖాళీగా ఉండి లోపలి వస్తువులు కనపడేలా ఉంది. లోపలికి చూసాడు ఎస్.ఐ. ఒక నీళ్ళ కుండ, రెండు మసిబారిన బొచ్చెలు కనపడ్డాయి.

పక్క ఇళ్ళలోంచి మనుషులు బయిటకు వచ్చి చూసారు. పోలీస్ పటేల్‌తో మాట్లాడే ధైర్యం వాళ్ళకు లేదు.

ఎస్సై అడిగాడు, "ఈ పొట్టిగాడు చెప్పిండు, గణేష్ ఇల్లిదేనా?"

వాళ్ళందరూ ఒకళ్ళు మొహం ఒకళ్ళు చూసుకున్నారు గ్రామంలోకి పోలీసువాళ్ళు రావడం అరుదు. ఎవళ్ళకో ఏదో మూడితేనే వాళ్ళొస్తారని అందరికీ అనుమానం. ఎవరూ మాట్లాడలేదు.

ఎస్.ఐ.కు కోపం వచ్చింది. "ఏంది? ఇదికాదా ఇల్లు? మాట్లాడరే! ఏయ్ ముసలాయినా నువ్వు జర్ర ముందుకురా. ఏమి నీ పేరు?"

ముసలాయిన భయపడుతూ ఒక అడుగు ముందుకేసి నిలబడ్డాడు. "ఏం చెప్పాలి దొరా? అది గణేషిల్లే. చాలా దినాల్నించి ఆయనిక్కడుండటం లేదు. ఏం చేసిండు?"

"పట్నంలో చదువుకుంటున్నాడు కదా?"

"ఔమల్లా, పెద్ద చదువులు చదువుతుండు! అదేందో మాకెరికలే."

ఎస్.ఐ. ఒక నిమిషం మౌనంగా అటు ఇటు పచార్లు చేసాడు. "ఈ ఊర్ల ఇంకా ఎంతమంది చదువుకుంటున్నారు?"

ముసలాయిన ఒకసారి ఆలోచించి చెప్పాడు, "చాలామందుంటారు సారు. ఊర్ల బడి పెట్టినారు గంద. పంతులు పై ఊర్లనుండి వస్తుండు పోతుండు. ఆయనకు తమామ్ ఎరిక."

"నేనడిగేది అది కాదెయ్. గణేష్ పోరనితో చదువుకునే పిల్లలున్నారా అని?"

ఒక యువకుడు ముందుకొచ్చాడు. "సారు - నలుగురు చదువుతుండ్రు. పటేల్ నర్సిరెడ్డి కొడుకు మహేంద్రరెడ్డి, కిరాణం దుకాణం కోమటి నల్లయ్య పిల్లడు సురేషు, గాడ్ని యగసాయం చేస్తాడు సిద్దప్ప ఆయన పిల్లడు ఉరేయ్ ఆడి పేరేంద్రా?"

పక్కనున్న మరో కుర్రాడు అందించాడు "రంగప్ప".

"గది సారు, ఈ గణేషు ఆళ్ళు కలిసి చదువుకుంటారు."

"ఈయమ్మ ఎప్పుడొస్తది?"

"చీకటి పడే వేలకొస్తది. ఎగుసం పని చూసుకుని, గట్లంట కోసిన గడ్డి పక్కూర్ల అమ్ముకుని వస్తది. ఏం చెప్పాలి దొరా?"

"అయ్యేం చేస్తుండు?"

"గాయిన కూలి పనులుకు పోతుండు. పట్నంలోనే బిల్డింగు పనులు చూసుకుంటుండు."

"ఎప్పుడొస్తుండు?"

"మాకు తెల్వద్దొరా. అప్పుడప్పుడొచ్చి పోతుండు. ఏం చెప్పాలి దొరా?"

ఎస్సై చెప్పాలా వద్దా అని ఆలోచనలో పడ్డాడు. మరో నిముషానికి మరో ప్రశ్న వేసాడు.

"ఆ ముగ్గురి పోరండ్ల ఇళ్ళెక్కడ?"

ముసలాయనకు ధైర్యం వచ్చి ముందుకొచ్చాడు. "ఈడ్నే దొరా. మాది ఐదు గల్లీల గామ్. ఈ రోడ్డు మొగలో ఉంది పటేలిల్లు. తరువాత మలుపులో కిరాణం నల్లయ్య దుకాణముంది, మరాడి నుండి ఎనక్కి మలుపుకొస్తే సిద్దప్ప ఇల్లు అగుపడుద్ది."

"నీ పేరేంది చెప్పావు కాదు?"

"శంకరయ్య దొరా"

"ఏందిరా పోరగా పాండ్రయ్య అంటివి గదా నీ పేరు?"

"అవుదొరా."

"మీ పటేలింటికి తోల్కపోతవా?"

పాండ్రయ్య హుషారుగా తలూపాడు. "వ్యాను ఎనగ్గ ఎక్కేదా? బిర్న పోవచ్చు!"

"ఓర్ని నీకు జీపు ముచ్చటవుతుందిరా! పైదల్ పోవడానికి నిప్పి లేచిందిరా? అట్టేగే ఎక్కు. అందరిళ్ళు చూపించాలి."

పాండ్రయ్య తలూపి జీపుఎక్కాడు. వాడికి ఏనుగెక్కినంత ఆనందం వేసింది. "ఆనక నాకు తెల్వదంటే చెమ్డాలొలుస్తాను బిడ్డా" అన్నాడు నవ్వుతూ డ్రైవరు. డ్రైవరు పక్క సీటులోకి ఎస్సై చేరాడు. చుట్టూ ఉన్న జనం నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తున్నారు పోలీస్ పటేలొచ్చిన కారణం తెలీక.

"జీపు పోనీయనా సార్?" అన్నాడు డ్రైవరు. ఎస్సై చేతిలోని చిన్న లాఠీతో తలపైన ఉన్న టోపీమీద చిన్నగా రాసుకుని "ఓ ముసలాయినా, గిట్రా" అని పిలిచాడు.

శంకరయ్య ఉరుక్కుంటూ వచ్చి చేతులు కట్టుకుని "సారు?" అన్నాడు వినయంగా.

"గిప్పుడు చెప్పు, గణేష్ అయ్యపేరేంది?" డైరీ తీసి బాల్ పెన్ను మూత తీసాడు.

"యాదగిరి దొర"

"తల్లిపేరు?"

"ఎంకటమ్మ"

"అన్నదమ్ములు, అక్క చెల్లండ్రు ఉన్నరా? బందుగులు? "

"ఈల్లు ముగ్గురే దొరా. బందుగులు వేరే గామ్ల ఉంటరు."

ఎస్సై డైరీ మూసాడు. "తోలమంటరా?" అన్నాడు డ్రైవరు మళ్ళీ.

"జర్రాగు" అని శంకరయ్యను మరికాస్త దగ్గరకు రాబట్టి చెప్పాడు, "గణేష్ ఉద్యమంలా పానాలు తీసుకుండు"

శంకరయ్యకు మతిపోయింది. "అంటే ఏంటీ దొరా!?"

"సచ్చిండ్రా. స్టూడెంటు పిల్లలు పట్నంలో గొడవలు లేపుతుండ్రు. ఆల్లకోసమని ఈయన నిప్పంటించుకుండు."

"గట్లయితే పూరా పానాలు పోయినాయా దొరా?"

"నీ యవ్వ. మాకేం దోచకొచ్చినామా? నీతో ముచ్చటలాడ్డానికొచ్చినామా? బాడి పెద్ద దవాఖాన శవాల గదల ఉన్నది. పోస్టుమార్టం, పంచనామా అయినాక రేపు ఈ ఏలప్పుడొస్తది. జర నెమ్మలంగ తమామ్ ఆళ్ళమ్మకు చెప్పండి. నాయినకు కబురు చేయండ్రి. ఇప్పుడు పోనీయ్ బండి."

డ్రైవరు ఇంజను స్టార్ట్ చెయ్యగానే గుఫ్‌మంటూ వెనుక గొట్టంలోంచి పొగ చిమ్మి గ్రామంలోని జనానికి సర్కారు బండికి మధ్య దట్టమైన పొగ నింపింది.

జీపు ముందుకు పోగానే జనం మధ్య కలకలం రేగింది. "ఎంతన్యాయం జరిగినాది. బగమంతుడు ఇంత చిన్న తనంలోనే తీసుకుపోయిండు!" అని ఒకరంటే "కలికాలం బిడ్డా. ఎవరెట్ట రాలిపోతరో తెల్వ." అని మరొకరు అన్నారు.

జీపు రయ్‌మని పోయి నర్సిరెడ్డి ఇంటి ముందు ఆగింది. పాండ్రయ్య జీపు దిగి ఇంట్లోకి ఉరికాడు. పోలీసులొచ్చారంటే ముందుగా నర్సిరెడ్డి పెండ్లాం వీధి తలుపు దగ్గరకొచ్చి తొంగి చూసింది. నిజంగా పోలీసులు కనపడ్డాకా నర్సిరెడ్డికి చెప్పింది

"గియాలప్పుడు పొద్దుమీద్కొచ్చినారు పోలీసులు గామ్‌లో ఏముందని? ఎలక్షన్లేవు, కొట్లాటల్లేవు. అంత మంచిగుంది గదా! నక్సలైట్లున్నరని గస్తీ తిరుగుతున్నారా ఏంది?"

నర్సిరెడ్డి పట్టె మంచం దిగుతూ అడిగాడు "గేందిరా ఆల్లు మనింటికేనా వచ్చింది?"

"అవుదొరా, కిరానం సాపోనిల్లు, సిద్దప్పనిల్లు కూడా చూపియిమండ్రు."

"గామ్ మీదికి ఏం తక్లీపొచ్చిందొ! మన ఇజ్జత్ మనం చూసుకోవాల్న. లక్ష్మీ నువ్వు చాయ్‌లు పెట్టు, ఆల్లని కూచోబెడ్తా" అంటూ బయిటకు కదిలాడు.

నర్సిరెడ్డి గుమ్మందాటేసమయానికి ఎస్సై జీపు దిగి బానెట్టు మీద జార్లబడి వసారాకేసి సూస్తున్నాడు. "నమస్తే సారూ. గిట్లొచ్చినారేంది? పైకి రాండ్రి, జర కూర్చొని మాట్లాడుకుందాం."

ఎస్సై వరండా మెట్లు ఎక్కి ఫేము కుర్చీలో కూర్చున్నాడు. డ్రైవరు కాఫీ కప్పు అందుకున్నాడు.

"ఎంతమందొచ్చారు సారు? ఇద్దరేనా?"

"అవు. మల్ల ఇప్పుడు స్టేషనుకు పోవాల. రేపయితే పదిమందికాడికొస్తాం. అప్పుడు మంచిగ అరేంజి చెయ్యండ్రి."

"ఏంది కత?"

"మీ ముంగల గల్లీలో గణేష్ అనే కుర్రాడున్నాడు గదా."

"అవు. మా పిల్లగాన్తో కలిసి పట్నంలో చదువుకుంటున్నడు."

"ఈ పొద్దుగేల పానాలు తీసుకుండు"

"గెట్లా"

"అవ్ పటేల్ కాలేజి పిల్లలు ఉద్యమం చేస్తుండరు."

"దేనికోసం?"

"తెల్వదా? ధరలు ఆకాశాన్నంటినాయని, పేదోన్కి తిండిలేదని, బతకడానికి స్వేచ్ఛ లేదని గేదేదో గట్ల చాలా డిమాండ్లున్నయి. గయన్నీ తీరితేగానీ పుస్తకం పట్టమన్నారు. పిల్లగాళ్ళు క్లాసు మొగం చూసి నెలదినాలయింది. కాలేజీల ముంగల టెంట్లేసి నిరాహార దీక్షలు చేస్తుండ్రు, దుకాణాల్ని బందులు చేయిస్తుండ్రు, గాడీలను తగలబెడుతుండ్రు. సర్కారు లొంగి రాకపోయెడె. గట్లాంటప్పుడు గేం చేస్తరు? ఆత్మాహుతికి దిగిండ్రు."

"స్టూడెంటు కుర్రాళ్ళు బందులు చెయ్యడాలు, రాళ్ళెయ్యడాలు స్వతంత్రకాలం నుండి చూస్తున్నదే కదా! నిరాహారదీక్షలన్నరు - అది కూడా మన పెద్దలు నేర్పించ్చినదే మరిదేం ఆత్మాహుతి? యాడ్నిండొచ్చింది? మనిషి జన్మెత్తడమే కష్టం. ఒకసారి పానాలుపోతే తిరిగిరావు కదా?"

"పటేల్ సాబ్ మనం గట్లనే అనుకుంటాం. మన పిల్లల దిమాగ్‌ల ఆ ఆలోచన లేదు. ఏం చేస్తం! రోజులెట్లున్నయో దునియట్లున్నది." అన్నాడు డ్రైవరు కలిపించుకుని.

"ఇప్పుడేం చెయ్యాల్న? శవాన్ని ఈడకు తెస్తరా? గామ్ మీదికి మా చెడ్డ కష్టమొచ్చి పడ్డదే!"

"రేపీ టయానికి శవాన్ని మా సర్కార్ వేన్లో తెస్తరు. గామ్ తిరునాల్లెక్కనుంటది. శవంతోబాటు స్టూడెంటు పిల్లలు, లెక్చరర్లు, ప్రజా సంఘపోళ్ళు, రాజకీయనాయకులు, ముందెనకల మా పోలీసోళ్ళు తమామొస్తరు." అన్నాడు ఎస్సై.

నర్సిరెడ్డి కంగారు పడ్డాడు. "అల్లందరి జమేదారి నాకేంది?"

"అరే చెప్పిందినుకో పటేలు. ఊర్లకొచ్చే జానలకు నువ్వేంటి చేస్తవో నాకు తెల్వ. మా స్టేషన్ జవాన్లు పదిమందిని చూసుకుంటే చాలు. గది సరే. ఈ ముచ్చట చెప్పడానికి రాలేదిప్పుడు. నీ కొడుకు కూడా చదువుతున్నంటగా పట్నంలో?"

"అవు?"

"ఈ గణేష్ దోస్తంటగా?"

"గయితేంది?"

"గట్లంటవేంటి పటేలు! జ్వర దిమాగ్ పెట్టి సోచాయించు. ఈ దినం గణేష్యుండు, రేపు నీ బిడ్డడు కాదనదేంది?"

నర్సిరెడ్డి తల పట్టుకున్నాడు "నాకు దిమాగ్ శక్కరొస్తోంది. నీ కాల్మొక్కుతా. నా బిడ్డకేం గాలేదు గదా సారూ?" అన్నాడు ఆకులా వణికిపోతూ. ఆయన గుండె మోకాలి కిందకు జారింది.

"అరే పటేల్ గట్ల వణకమాకు. ఈ పొద్దుకేం గాలె. రేపటి మాట చెపుతున్నా పోరండ్లందరూ ఒక్క లెక్కనే ఉన్నారు. ఏ మినిట్ల ఎవరికేం ఆవేశం వస్తదో తెల్వకుండె నేం చెప్పేది సోచాయించు. ఈ గామ్‌లో ఇంకో ఇద్దరు స్టూడెంట్లు ఉండిరంట. ఆల్లను ఇంటికి పిలిపించుకొండ్రి. సమజయిందా? మేం వస్తం. రేపు మమ్మల్ని కాస్త జూసుకోండ్రి" ఎస్.ఐ లేచాడు, డ్రయివరు ముందే లేచి స్టీరింగు దగ్గర నిలబడ్డాడు. పాండ్రయ్య అడక్కుండానే గాడి ఎక్కాడు.

జీపు షావుకారింటికి, సిద్దప్ప ఇంటికి పోయి ఇళ్ళలో బయం పుట్టించి తిరిగి రావి చెట్టు దగ్గరకు వచ్చింది. అప్పటికింకా గణేష్ తల్లి ఎంకటమ్మ రాలేదు. ఇండ్లలో జనాలు ఆ ఇంటిముందే మూగి ఉన్నారు. శంకరయ్య మాత్రం జీపు దగ్గరకొచ్చి "సారూ ఆ పాలెగాండ్లొస్తేగాని మేమి చెయ్యడానికేం లే." అన్నాడు చేతులు కట్టుకుని. లాఠీ కొన డ్రైవరు వీపుకు తగిలింది. ఇంజను స్పీడందుకుని ముందుకు కదిలింది.

జీపు కనుచూపు మేర దాటేలోగా నర్సిరెడ్డి వచ్చాడు. మరో గల్లీలోంచి కోమటి నల్లయ్య, రైతు సిద్దప్ప ఉరుక్కొచ్చారు.

సిద్దప్ప పొలం నుంచి ఇంటికి పోతే "ఇంతకు ముంగల పోలీసులొచ్చిండ్రు" అని ఆడవాళ్ళు చెపితే కండువాతో మొహానికి పట్టిన చెమట్లు తుడుచుకుంటూ వచ్చి నర్సిరెడ్డి ముందర నిలబడి "నమస్తే దొరా. ఏంది ఘోరం? గణేష్ పానాలు తీసుకున్నంటగదా?" అన్నాడు కంగారుగా.

"నీ కంతనే తెలిసిందా? పోలీసోండ్లు జరూర్ మన పిల్లగాండ్లను సమదాయించుకోమని కూడా చెప్పిండ్రు. ఈ దినం గణేషయిండు, వానెంబడి తిరిగే మీ పిల్లలు గట్ల కారనేది అనిండ్రు. ఆ మాటలకు నా గుండె అక్కడే జారినాది. ఇప్పటికి కాళ్ళు చేతులు కూడదీసుకుని గిట్లొచ్చినా."

"మీ పిల్లగాడు మహేంద్రరెడ్డి తాన సెల్లుంది కదా, ఫోను కొట్టినావా?" అడిగాడు సిద్దప్ప.

"అరే! ఇంత టైం యాదికి మరచినా. బాగా యాద్ చేసినావన్నా" అంటూ జేబులోంచి సెల్ ఫోన్ తీసి నెంబరు కలిపాడు. అటునుండి ఎంగేజ్ సౌండ్ వచ్చింది.

"మా సురేష్ గాడు ఏడున్నడో తెల్సుకో పటేలు!" అన్నాడు కోమటి నల్లయ్య.

"ఏందివోయ్ ఫోను కలిస్తే కదా కుశిలాలు తెలుసుకునేది. దీనవ్వ ఎన్నిసార్లు చేస్తోన్నా మొరాయిస్తోంది" అన్నాడు విసుగ్గా నర్సిరెడి.

సందు మొదల్లో ఎంకటమ్మను చూసారందరు. జనాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎంకటమ్మ అల్లంత దూరంలో ఉండగానే గుర్తుపట్టేందుకు వీలుగా ఉంటుంది ఆమె ఆకారం. పొలం పనికి, మార్కెట్టుకు గడ్డిమోపు మోసుకు పోవడానికి కాళ్ళు సహకరించడానికి వీలుగా ఉంటుందని చీరను మోకాళ్ళ వరకూ పైకి లేపి గోచీగా పెట్టుకుంటుంది. పొలానికి వెళ్ళేటప్పుడు, ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు

తలపై పవిటచెంగు చుట్ట, దానిపై కిరీటంలా ఈతాకు బద్దలతో చేసిన తట్ట ఉంటాయి. తట్టలో పదనుగా ఉన్న కొడవలి, చెయ్యి తగలకుండా జాగ్రత్త కోసం చుట్టిన పాత ఎర్రజాకెట్టులో, ఉదయాన్నే పల్లెను జాగృతం చేసే కోడిపుంజు తలలా ముందు భాగాన కనపడుతుంది. నిత్యం తలపై మోసే పచ్చగడ్డి బరువుకు నడుము వెనక్కు వంగి ముందున్న ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించే దృష్టి కలిగించింది. మార్కెట్లో గడ్డి మోపు బరువు తగ్గించుకోగలిగితే దానితో వచ్చే పైసలతో వెచ్చాలు ఇరుముడులుగా కుడి భుజానికి రెండు పక్కలా కొమ్మను పట్టుకు వేలాడే ఉడత పిల్లల్లా ఊగుతుంటాయి. ఆకృతి లేకుండా వాష్ టెక్నికల్ చిత్రకారుడు వేసిన బొమ్మలా ఉంటుంది అంత దూరానికి. అడుగులో అడుగు వేసుకుంటూ దగ్గరకు వస్తోంటే మొహం పైన ముడుతలు, లోతుకుపోయిన కళ్ళు, గుహల్లాంటి చెంపలు, ఒడిలిపోయిన శరీరం - ఒక్కొక్కటే బయిట పడతాయి.

వెంకటమ్మ ఇంటికి ఇరవై అడుగుల దూరం వరకూ వచ్చింది. బిలబిలమంటూ జనం - ఆవీధిలో వాళ్ళేకాదు, అన్ని వీధులవాళ్ళు ఆడ, మగ, పిల్ల పీచూ ఆమె కంటబడింది. పెద్దలు రావి చెట్టు బండ మీద కూర్చుని, ఖాళీ జాగాల్లో నిలబడి, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ, నడూస్తూ - పిల్లలు నేలబండ ఆడుతూ, పరుగెడుతూ, గెంతుతూ -

"ఏందిది మన గుమ్మం ముంగల? రావి చెట్టుకు పండగొచ్చిందా? చెట్టుకింద మైసమ్మకు కోపమొచ్చి గణాచారి మీదకు పూనకమొచ్చిందా? ఏటికొక్కమారు బోనాలు చెయ్యడానికి కష్టముంటే మల్లి అమ్మొచ్చి ఏటకావాలి, తాటికల్లు కావాలంటే ఏడ దెచ్చేది? పెద్దమనసులైతే చందాలేసి చేద్దమంటరు. సందెకాడికి గంజినీల్లకు చాలినంత నూకలే లేనికాడికి పైసలేడ దెస్తం?" గొణుక్కుంటూ మొహం చిట్లించుకుంటూ ఇంటి గుమ్మం వరకూ వచ్చింది.

"శంకరయ్యా పక్కింటోడివి నువ్వు చెప్పరాదూ?" అన్నాడు ఆ తరువాతింటాయన.

"ఏం చెప్పాల్ల. నాకు మాట ఆడట్లా. ఇట్టాంటి కబురు ఇన్పించడాన్కి దైర్నం కావాల్న. పెద్ద మడుసులందరు ఈడ్నే ఉన్రిగదా, గాళ్ళే జెప్తారు. ఓయ్ యెంకటమ్మా జర్రాగు. నీకోసమే ఇంతమందిమి కాసుకున్నాం. పటేలయ్యా ఈ గావ్ జమ్మేదారి నీది. పోలీస్ సారు నీ తానకొచ్చిండ్రు గదా. నడిమింట్ల నన్నిరికించకండ్రి" అంటూ శంకరయ్య రావి చెట్టు బండకు జార్లబడి కిందకు జారి కూర్చున్నాడు.

అందరూ పటేల్ నర్సిరెడ్డి కేసి చూసారు. పటేల్ని చూసిన వెంకటమ్మ గంప కిందకు దించి, భుజం మీద పచారి మూటల్ని గంపలో పడేసి, పవిట చుట్టను విప్పి వంటిమీద కప్పుకుంది.

నర్సిరెడ్డి గొంతు సవరించుకుని అన్నాడు, "ఎంకటమ్మా నువ్వు ముంగల ఆరామ్ కూర్చో. కష్టాల్నయి కమ్జొరోళ్ళకి వస్తయి, జమిందార్లకీ వస్తయి. గయొచ్చినప్పుడు జరదిమాగ పెట్టి సోచాయించాల్న, దైర్నం తెచ్చుకోవాల్న."

●●●

**వెంకటమ్మకు అర్థం కాలేదు**. సూటిగా నర్సిరెడ్డి మొహంలోకి చూడలేక తల పక్కకు తిప్పి పక్కింటి ఆడకూతుర్ని చూస్తూ అంది. "కష్టమొస్తే ఏం చేసేడిది. నా తాన దాచబెట్టిన పైసలేం లేవు."

"నీకు కష్టమైందని ఎవరు చెప్పిండ్రు?"

"ఊరోళ్ళు పండగలు చేసుకోండ్రి, జాతర్లు చేసుకోండ్రి. నన్ను బలిదానానికి పైసలడగమాకండి. మీతో ఒక ముద్ద పెడితే తింటను, లేదంటే నల్ల నీల్లు తావి ఆ బండమీన పడుంటను."

వెంకటమ్మకు విషయం తెలియదని అర్థమయింది పటేలుకు. "వెంకటమ్మ నువ్వు సోచాయించినట్టూ బోనాలు గీనాలు బాత్‌చిత్‌నై. నీ ఇండ్ల కష్టమే మాట్లాడ్డానికి జమైపోనాం. సమజౌతోందా? దునియంత ఎవ్వరూ శాశ్వతం కాదు. ఈ దినాం నీ కష్టమైంది

రేపు మా కష్టమౌతాది. నీ పెన్మిటికి కబురు పంపినాం. రేప్పొద్దుగాలకైన వస్తడు. నువ్వు ధైర్యం గుంటే చాలు, మేం నీ ఎనకనే ఉండి అన్నీ జరిపిస్తం.''

వెంకటమ్మ అయోమయంగా చూసింది. ''నాకొచ్చిన కష్టమేంది దొరా. దినాం ఉండే కష్టమే గదా?''

మాట నాలిక చివరి వరకూ వచ్చినా చెప్పలేకపోతున్నాడు నర్సిరెడ్డి. కాసేపు దిక్కుల వంక చూసి సెల్ ఫోను రిడయల్ బటన్ నొక్కాడు. ఇప్పుడూ లైన్లోకొచ్చాడు కొడుకు మహేందర్ రెడ్డి.

''బాపూ ఏంది కాల్ చేసినావ్?''

కొడుకు రొప్పుతూ మాట్లాడ్డట్లు వినిపించింది. కార్ల శబ్దం ఎక్కువగా ఉంది. ''ఏంది బిడ్డా గట్ల వగురుస్తున్నావు? రోడ్డు నడిమిట్ల ఉన్నావా ఏంది?''

''ఔనయ్యా బజార్న జులూస్‌ల ఉన్నా. జల్దీ చెప్పు. దేనికి ఫోను కలిపినావు?''

''గణేష్ పోయిండంట. నిజమేనా బిడ్డా!''

''అవ్. మేం ఇప్పుడు హాస్పటల్ తానకే ధర్నా చేయడానికి పోతుండాం.''

''మేమంటే ఎవులు?''

''అన్ని కాలేజీల దిక్కునుండి అందరం. పిల్లలు, మాష్టర్లు, లీడర్లు, లాయర్లు, చాలా గొప్పోళ్ళుండ్రి. గవర్నమెంటు ఈ దినం దొగొస్తందంటుండ్రు''.

నర్సిరెడ్డి చెవి పక్కకు చేరారు నల్లయ్య, సిద్దప్ప. సిద్దప్ప తన పిల్లవాడి గురించి తెలుసుకోమని సంజ్ఞ చేసాడు.

''మనోళ్ళు ఏడుండ్రు? ఆళ్ళే రంగప్ప, సురేషు''

''ఈడ్నే, జులూస్‌లో. దేనికి బాపు?''

''లైన్ల ఉండు, మాట్లాడతా'' అని వాళ్ళకేసి చూసి ''అందరూ ఆడ్నే ఉన్నరు. ఏం చెప్పమంటరు?''

''ఏం చెప్పేది పటేలు? జరూర్ గావ్ వచ్చెయ్యమని చెప్పు.'' అన్నాడు నల్లయ్య.

''ఆల్లమ్మ బీమారైదని చెప్పు.'' అన్నాడు సిద్దప్ప.

''రంగప్ప ఆళ్ళమ్మ బీమారైంది. నల్లయ్య ఆళ్ళ బిడ్డను ఒక దఫా వచ్చి పొమ్మంటుండు. కాలేజీలు బందయినంట గదా? అందరూ వచ్చెయ్యండ్రి. రేతికి కడ బస్సు పట్టుకుని వచ్చెయ్యండ్రి''

అటు ఫోను కట్టయింది. తను చెప్పిన మాటలు వానికందాయో లేదో అర్ధం కాలేదు.

''వస్తుండ్రా?''

''తెల్వ. పోను కట్ చేసిండు'' దిగాలుగా చుసాడు నర్సిరెడ్డి.

ఇప్పుడు వెంకటమ్మ కళ్ళలో అమాయకత్వం తొలిగి కొద్దిగా భయం కనపడింది. ''ఏడకి బోయిండు నా బిడ్డ? నా బిడ్డ ముచ్చట ఎవుర్ని అడుగుతుండ్రు?'' అంది సూటిగా నర్సిరెడ్డిని చూస్తూ.

''చెప్పేయ్ పటేలు. దాపెట్టి చేసేదేంది. ఆ తల్లి పేగు మమకారంతో ఏడిస్తే బిడ్డ ఆత్మకు శాంతౌతాది.'' అన్నాడు ముసలి శంకరయ్య.

''గదే సోచాయిస్తున్నా ఎట్ల శురూ చెయ్యాల్నా అని. చూడు ఎంకటమ్మా, ఎవుళ్ళం శాశ్వతం కాదు. తాత నాయనమ్మల కాణ్ణించి, అమ్మ అయ్యల కాణ్ణించి, కట్టుకున్న పెనిమిటి బిడ్డల కాణ్ణించి ఎవలకెవలం గాం.''

ఎంకటమ్మ తెరిచిన నోరు అలాగే ఉండిపోయింది. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. తన బిడ్డకేదో ప్రమాదం జరిగిందని అర్థం చేసుకుంది. కీచు గొంతుకతో ఎక్కిళ్ళు బెట్టింది, ముక్కు ఎగేస్తో రాగం తీసింది. "చెప్పు నాయినో. నా బిడ్డా.. నీకేటి కష్టమొచ్చిందిరో.. నా బిడ్డా... సల్లంగ పది కాలాలు బతుకన్నో.. నా బిడ్డా... నా బిడ్డ మంచిగుండడని మాట చెప్పు పటేలా.... నీ కాల్మొక్కత పటేలా... పటే-లా.."

ఎంకటమ్మ గుండెల్లోంచి తన్నుకొచ్చిన బాధకు అందరి కళ్ళూ చెమర్చాయి. నర్సిరెడ్డి బండ దిగి ఎంకటమ్మ దగ్గరకు వచ్చి పక్కనే తనూ గొంతుక కూర్చుని భుజం మీద చెయ్యివేసాడు. "అమ్మీ నీ ఇంట్ల మస్తు కష్టమొచ్చింది. దేమునిచ్చిన కష్టం. నిన్ను ఏడ్వమాకని చెప్పేవోల్లం కాం. నీ కడుపు మంటల తీర్చగలోలం కాం. నీ బిడ్డడు ఆ దేమునికాని కాయనే వోయిండు."

ఎంకటమ్మ ఏడుపు తారాస్థాయినందుకుంది. "ఎవరు సంపినోరు బిడ్డో.. నిన్నెవరు సంపినార.. నీ ఉసురు తీసుకున్నోల్లు పురుగులు పట్టి సస్తరు బిడ్డా. ఆళ్ళ బొందలు శ్మశానంలా వెట్టా. మైసమ్మ తల్లో. మా ఇంటి ఇలవేలుపు మైసమ్మ తల్లా. గిట్ల నాకన్యాయం జేస్తివేంది తల్లా. తల్లా"

నర్సిరెడ్డి ఐదు నిముషాలు అలాగే కూర్చున్నాడు. ఆమె రాగాలు పెడుతోనే ఉంది. కాళ్ళు బార్లాచాచుకుని, జుట్టు విరబోసుకుని, పూనకం వచ్చిన దానిలా ముందుకు వెనక్కూ ఊగుతూ మట్టిలో దొర్లుతూ పిచ్చిదానిలా అరుస్తోంది.

నర్సిరెడ్డి లేచి నిలబడ్డాడు. ఎంకటమ్మ ఏడుపుని ఆపుచేసుకుని అడిగింది, "నా బిడ్డ ఎట్ల పోయిండు నాయినా? మోటరు గాడికింద బడ్డనా? సావస గాండ్లే సంపిన్రా, బీమార్ చేసి పోయిండా? ఏం జరిగింది నాయినా? ఎట్ల వోయిండు నాయినా?"

"పోలీసోండ్లు చెప్పిందే నాకు తెలుసు. ఆళ్ళు జీపు మీద నేరుగా నా ఇంటికొచ్చి మీ బిడ్డల్ని జర్ర మంచిగ జూసుకోండ్రి అనిండ్రు. ఏంది కతానంటే అప్పుడూ గణేష్ సంగతి బయట పెట్టిన్రు. గణేష్‌ను ఎవ్వరూ సంపలా, ఏ మోటరు గాడీ టక్కరియ్యలా. ఆయనే ఆత్మాహుతి చేసుకున్నట. శవాన్ని రేపు పొద్దుగాలే పోలీసోండ్లు అప్పజెప్తమన్నరు. ఇగ జెప్పు నీ పాలెగాండ్లెరున్నరు? దగ్గర్ల ఉంటిరా? దూరాన ఉంటిరా? ఫోన్లు కొట్టాల్నా? మడిసిని పంపి తోలుకు రావాల్నా? నువ్వేం ఫికరు పడమాకు. శవం వచ్చే టయంకి మేం అన్నీ చూసుకుంటాం. పాడె, కట్టెలు, బట్ట, చప్పుళ్ళు అన్నీ మేం జూస్తం. నీ బాధను మేం దీర్చేటిది కాదు. గావ్ ఓళ్ళం అంత సాయానికే పనికొస్తం" నర్సిరెడ్డి గబగబా చెప్పేసాడు మనసులోని మాటలు. మళ్ళీ ఆమె ఏడుపు మొదలుపెడితే చెప్పడం కష్టమని తరుముకొచ్చినట్టు చెప్పాడు.

ఎంకటమ్మ ఆ మాటలు పూర్తిగా విందో లేదో తెలియదు. స్పృహ తప్పి కింద పడిపోయింది. నీళ్ళు తెచ్చి మొహం మీద చల్లారు. కాసేపటికి కళ్ళు తెరచింది.

మొహం మీద చిలకరించిన నీళ్ళు పావలా అంత బొట్టును రక్త నదీ ప్రవాహాల్లా చీల్చేసాయి. తడిసిన జుట్టు పాయలు పాయలుగా గాడ్పుకు బీటలు పడ్డ భూమిలా విడిపోయింది. అప్పటి వరకూ ఏడ్చిన ఏడ్పుకు ఉబ్బిపోయిన గుడ్లు రెండు గుంటల్లోంచి పొడుచుకొచ్చిన స్ఫటిక లింగాల్లా ఉన్నాయి. ఎంకటమ్మ నేలమీద పడి పొర్లాడుతోంది. జీవన పోరాటంలో అలిసిపోయిన ఆ మట్టి మనిషికి గుర్తుగా రెండు రొమ్ములు ఆచ్ఛాదనకు మించిన జాకట్టులోంచి బయటపడి శివుని ఢమరుకపు తంత్రుల్లా అటు ఇటు కొట్టుకుంటున్నాయి. పక్కింటివాళ్ళు, పొరుగింటి వాళ్ళు, పక్క గల్లీల వాళ్ళు - అందరూ ఎంకటమ్మను చూస్తున్నారు. గోలగోలగా మాట్లాడుకుంటున్నారు.

"ఆ గణేష్ కేమొచ్చె మాయరోగం? గట్లా పానాలు తీసుకుంటే ఏమి లాభమొస్తది?"

"అందరి ఆకలి తీర్చడానికి సచ్చిండట!"

"ఆ తల్లి ఆకలితో మాడినా సవ్వలేదే! దినాం పిడికెడు మెతుకులతో పానాలు నిలబెట్టుకుని బిడ్డడి చదువుకు తన రక్తాన్ని వోసిందే!"

"కొడుకు పెద్ద సదువులు సదివి వస్తడు, తన్ను ఉయ్యాల బల్లమీద కూర్చుండబెట్టి కడుపు నిండ బువ్వ తినిపిస్తడు అనుకుంటూ కడుపు మంటను కలల నీళ్ళతో సల్లార్చుకుందే!"

"ఏం చేసిండు ఆ కొడుకు? ఎవరాకలి తీర్చడానికి బలి పెట్టుకుండు?"

అక్కడే ఉన్న నర్సిరెడ్డి భార్య లక్ష్మి బాధగా అంది, "మనం ఎన్ననుకుంటే ఏందమ్మా. సచ్చినోడు బతికి రాడుగా! ఆ తల్లి కడుపు తీపి ఆయనకేం దెలుస్తది? గావాల్లో మనవుంటం, సదువుల పేరుతో పట్టణాల్లో పిల్లలుంటరు. బిడ్డలు గొప్పోళ్ళవ్వాలని మనం ఆలోచిస్తుండాం. మనకందనంత దూరం ఎగిరిపోవాలని ఆళ్ళ ఆలోచన. ఆళ్ళ జమ్మేదారి మనం తీసుకుంటాం. ఆళ్ళు తమామ్ ఎవ్వరికి జమ్మేదారి కానట్లు పైలా పచ్చీసుల్లా తిరుగుతుంద్రు." ఈ మాటలంటూ దుఃఖం తన్నుకొచ్చి తను కూడా ఏడ్చేసింది.

"గణేష్‌తో పాటు మన బిడ్డలు కూడా సదువుతుంద్రక్కా?" అంది సరస్వతి.

సరస్వతి సిద్దప్ప భార్య. గడప దాటి బయటకు వచ్చే అలవాటు లేని మనిషి. సిద్దప్ప రోజుల్లా పొలంలో ఉంటే, సరస్వతి ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ వేళకు కారెజీ సిద్దం చేసి పశువుల్ని తోలుకుపోయే పొట్టేగాళ్ళొచ్చినప్పుడు ఇచ్చి పంపేది. కాస్త తీరుబాటైతే పటేల్ ఇంటికి వెనుక గుమ్మంనుండి వచ్చి లక్ష్మిని "అక్కా ఏం జేస్తుడవూ?" అని పలకరించేది. మెయిను గుమ్మం సావిట్లో నర్సిరెడ్డికోసం వచ్చే పెద్దమనుషులు, తాలూకా ఆఫీసు పనుల సాయం కోసం వచ్చే వాళ్ళు, రాజకీయాలు ముచ్చట్లేసుకునే వాళ్ళు రకరకాల మనుషులు ఎవరో ఒకరు ఎప్పుడూ ఉంటోనే ఉంటారు. లోపల పడగ్గదిలోనైనా, వంటగదిలోనైనా లక్ష్మి ఒంటరిగానే ఉంటుంది. తనకోసం ముచ్చట్ల కొచ్చే సరస్వతి అంటే లక్ష్మికి కూడా అభిమానం ఎక్కువ.

వాళ్ళిద్దరి మధ్య వంటింటి కబుర్లలో కుటుంబ విషయాలు కూడా చోటు చేసుకునేవి. లక్ష్మి భర్త రాజకీయ హోదాల గురించి, చుట్టాల పలుకుబడుల గురించి చెపితే, సరస్వతి వ్యవసాయంలో లాభనష్టాలు, పెనిమిటి పడే శ్రమ గురించి చెప్పేది. వాళ్ళ మధ్య తప్పని సరిగా వచ్చే ప్రస్థావన పిల్లల చదువు. పిల్లలు చదివేది ఒకే క్లాసు, ఒకేకాలేజీ, ఒకే పట్టణం. పిల్లల చదువుల గురించి చెప్పుకునేటప్పుడు వాళ్ళ మధ్య సాన్నిహిత్యం బలపడేది.

వీళ్ళిద్దరితో అప్పుడప్పుడూ పచారీ షాపు నల్లయ్య భార్య మణమ్మ కూడా చేరేది. వాళ్ళ బిడ్డ సురేష్ కాలేజీ ఫీజు కట్టాలన్నప్పుడు ఎంత కట్టాలో వివరాలు తెలుసుకు రమ్మని పంపించేవాడు నల్లయ్య. ఫీజులు వివరం తెలిసాక ఒకసారి గుండెలు బాదుకునేది. "ఇంతంత సొమ్ములు పోసి ఏటి చదివిస్తాం. పైస పైస జమ చేసి పట్కపోయి కాలేజీలకు వెడుతున్నాం. చదువు మానేసి దుకానం చూస్కోరా నాయినా అంటే ఇనకపాయె."

లక్ష్మి నవ్వుతో బదులిచ్చేది "షావుకారు బిడ్డవనిపించినవు తల్లి. ఎవ్వరి తాన పైసలైన పైసలే. వాల్ల బాగుకోసం పైసల్దియ్యక దేనికోసం దాచి వెడ్తవు?" అంటే ముసి ముసి నవ్వులతో వెళ్ళిపోయేది.

గణేష్ అమ్మను పరామర్శించడానికి ఇప్పుడు మణమ్మ కూడా అక్కడే ఉంది. "పటేల్ చెప్పినాడా మన బిడ్డలు ఆడేం చేస్తుంద్రో?" అంది సరస్వతి మాటతో మాట కలిపి. మణెమ్మ మాటలో భయం తొంగి చూసింది.

"నాకు తెల్వ.ఎవని బుద్దులెట్లుంటయో దేముని కెరుక. గణేష్ మన బిడ్డల్తో బాటేగా సదువుకుంటున్నది. గిట్లాంటి కమ్జోర్ పని చేస్తడనుకుంటిమా! ఎవులు నేర్పింద్రో బద్మాష్ గాండ్లు. పానాలు తీసుకుంటే గుడ్లప్పగించి చూస్తుంద్రా? పోలీసాయన చెప్తావుంటే తలుపు మాటున వింటిని. పోరగాండ్లు జులూస్ చేస్తనట. ఈయన చేసిన గొప్ప పనికి శవాన్ని ఊరేగిస్తరట. బిడ్డల కోసం ఏడ్చి ఏడ్చి మన పానాలు గాల్లో కలిస్తే మన కట్టెల్ని కూడా ఊరేగిస్తారేమో?"

నర్సిరెడ్డి ఇంటి దారి పట్టాడు. "గిప్పుడేం చేసేది దొరా?" అన్నాడు వెంటబడిన శంకరయ్య.

"చేసేదేంది? రేపే టయానకొస్తదో శవం. అప్పటికి ఊళ్లపోల్లం అందరం ఈడ్నే ఉండాల. సర్కారోళ్ళే శవాన్ని ఒప్పచెప్తరు. శవమెంట కాలేజీ పోరండ్లొస్తరంట, నాయకులొస్తరంట. శవం శ్మశానం తాన బొందల పెట్టేవరకూ గామంత గరంగరముంటది."

"గదట్లుంచు పటేలు, రేపటికి కర్సు జబర్దస్తుంటది. దానిమాటేంది. ఊర్ల చందాలు శురూ చేసిస్తవా? గెట్ల చూసిన ఐదువేలు దాటుద్ది. ఆయమ్మి తాను బొక్కలు తప్ప ఏం లేవు" అనుభవంతో చెప్పాడు శంకరయ్య.

నర్సిరెడ్డి ఒక్క నిముషం ఆలోచించాడు. "నాకు తెల్వదా? సంగతి తెలిసిన కాడ్నుంచి అదే సోచాయిస్తున్నా. ఇది ఐదువేలతో బచాయించే మాటగాదు పోలీసోండ్లు నామీన పడుతుండ్రు. పైసలదేముందిలే, గామ్ పెద్దగ ముంగల నా జేబునుంచి కర్సువెడతా. పాడె, కట్టెలు, దండలు, చప్పుళ్ళు అన్నీ శవం ఇంటికొచ్చినాక మాట. ఈ రాత్రికి మీ గల్లీపోళ్ళందరు జర మంచిగ చూసుకోండా యమ్మిని" అనేసి ముందుకు కదిలాడు. సిద్దప్ప, నల్లయ్య ఆయన వెంటబడ్డారు. వాళ్ళు ముగ్గురూ పదడుగుల దూరం వెళ్ళాకా లక్ష్మి, సరస్వతి, మణమ్మ కూడా జట్టుగా ఇంటికి బయలుదేరారు.

అప్పటి వరకూ అక్కడే ఒక మూలగా నిలబడి చూస్తోన్న పాండ్రయ్య తన సావాసగాళ్ళతో బర్రెల దొడి దగ్గరకు మరో దారిలో ఉరికాడు.

ఎంకటమ్మ ఉన్న కొద్ది ఓపికతో "నా నాయనో.. నన్నాయనో నా బిడ్డో" అంటూ కీచు కంఠంతో రాగం తీస్తోంది. పక్కింటి లక్ష్మమ్మ స్టీలు గిన్నెలో టీ కలిపి రెండు గ్లాసులు తీసుకొచ్చి పక్కన చతికిలపడి గిన్నె నుండి, గ్లాసునుండి అటు ఇటు నాలుగు సార్లు కలబోసి నిండు గ్లాసు ఎంకటమ్మ చేతికందించి "సచ్చినాయన ఆత్మ శాంతించాలంటే బతికున్నోల్లు ఏడ్వాల. లేకుంటే పిశాచాలౌతరు. పానాలు నిపుపుకుంటేగదమ్మా ఆ బిడ్డ గురించి ఏడిసేది. జర చాయి రెండు గుక్కలు తావు. పొద్దుటేళ వన్నం తింటివో లేదో, పొద్దుగుంకినాకయినా కాసింత అంబలి కాసుకుని తావనీకుండా సావుకబురంటివాయె" అంది.

ఎంకటమ్మ గ్లాసును పక్కన పెట్టబోతే "తాక్కుంటే ఎట్లా? నీ పానాలు ముఖ్యం. పోయినోళ్ళు తిరిగిరారు" అని గదమాయించారందరూ. బలవంతాన చాయి నోట్లో పోసుకుంది. ఈసారి లక్ష్మమ్మ కూడా తోడుగా ఏడ్చింది. "గణేషు బిడ్డో నీకు నూరేండ్లు నిండినాయా బిడ్డా ఈ తల్లిని అన్నాయం చేసి బోతివి గదా బిడ్డా బిడ్డా"

లక్ష్మమ్మ రాగానికి ఊకొట్టుడుగా మూలుగుతోంది ఎంకటమ్మ. చీకటి మాపున గల్లీలో జనాన్ని తప్పించుకుంటూ వచ్చారు రాములు, చంద్రమ్మ. ఎంకటమ్మకు చెల్లెలు చంద్రమ్మ, రాములు బావౌతాడు. వాళ్ళిద్దరూ పక్క ఊళ్ళోనే వ్యవసాయం పనులు చేసుకుంటారు.

చెల్లి, బావలను చూడగానే వెంకటమ్మ నేలను పడి దొర్లుతో ఏడ్చింది. చంద్రమ్మ అక్క పక్కన జేరి ఏడుపు అందుకుంది. లక్ష్మమ్మ టీ గ్లాసులు, గిన్నె తీసుకుని తన ఇంట్లోకి వెళ్ళిపోయింది. రాములు రావిచెట్టు బండకు జేర్లబడి కూర్చుండిపోయాడు. ఐదు నిముషాలు, పది నిముషాలు, మరో ఐదు నిముషాలు ఇద్దరి ఏడుపు ఆకాసాన్నంటింది.

కొంతసేపటికి ఎంకటమ్మ చల్లారి రాములు చేతులు పట్టుకుని అడిగింది "ఎట్లొస్తివి బావా? గణేష్ గాడి సావు కబురు ఎవరు చెప్పిండ్రు?"

"నేనీడనే బాపన్ల పొలంలో ఎగుసం పని చేస్తుండా. ఈ ఊర్లాయన మోటరు గాడి మీద పోతూ నన్ను చూసి కబురు చెప్పిండు. గంతేనమ్మా గా మినట్లో ఊర్లోకి పోయి మీ చెల్లిని తోలుకుని పైదిల్ మీదొచ్చినా. మీ చెల్లి ఉట్టి మడిసి కాదు కడుపుల బిడ్డ తన్నతన్నా, కాళ్ళు గుంజుతున్నా గట్లనే ఉరికింది. ఏంది పాడు దినాలయినాయి. చేతికందొచ్చిన కొడుకు చనిపోయిన్నంటే ఏందనుకోవాల? ఆడ్ని మంచిగ కూలిపనికి పెట్టనంటే ఇనుకోలేదు. బిల్డింగు పనుల్ల వెడితే పెద్ద మేస్త్రి అయ్యేవోడు."

చంద్రమ్మ కూడా గణేష్ చిన్నతనం ముచ్చట్లు జ్ఞాపకం చేసుకుని చెప్పసాగింది. వాళ్ళ ముగ్గురు మధ్య మాటలు పెనవేసుకు పోయాయి. కడుపులో బాధ తన్నుకొచ్చినప్పుడు గట్టిగా శోకాలు పెడుతున్నారు అక్కా చెల్లెళ్ళు. గల్లీలో మనుషులు ఇళ్ళబాట పట్టారు. వాతావరణం నివులు గప్పిన నిప్పులా పైకి ప్రశాంతంగా ఉంది. ఊరు చీకటిని పులుముకుంది. మధ్య మధ్యలో రావి చెట్టు గాలి ఎక్కువై వాళ్ళ రోదనలు ఊరంతా తిప్పుతోంది.

●●●

**పటేల్ నర్సిరెడ్డి ముందు నడిస్తే వెనక సిద్దప్ప,** నల్లయ్యతో బాటు కొంత ఊరి జనం నడిచారు. ఇల్లురాగానే నర్సిరెడ్డి వాలు కుర్చీలో కూలబడ్డాడు. అక్కడ ఉన్న నాలుగు కేన్ కుర్చీలు పెద్దమనుషులు నలుగురు ఆక్రమించారు. మిగిలిన జనం సావిట్లో అంచు వెంబడి కాకులు వాలినట్లు కూర్చున్నారు. నలుగురైదుగురు ఆడ వాళ్ళు లక్ష్మితో బాటు పెరటి దోవంబట వెనక వసారాలోకి చేరారు.

కొన్ని నిముషాల మౌనం తరువాత సిద్దప్ప నోరు విప్పాడు. "మనోళ్ళను రమ్మని చెప్పినవుగదా?"

"వస్తరు. మనం చెప్పినం గదాని రారు. ఆళ్ళ దోస్తు కోసం జులూస్ చేస్తుండ్రిగదా! శవమెంబడి వస్తరనే ఉంది."

"గెప్పుడొస్తే ఏంది కానీ ఆళ్ళు నవ్వకుంటే చాలు. నాకు గుండెల్లో గులవతాంది. నరాలు మెలిపెట్టినట్టున్నయి పటేలు."

"ఆళ్ళను సదువు మాన్పించేద్దావా పటేలు? ఈ గామ్ నుంచి నలుగురు పిల్లలు మంచిగ పైకొస్తరనుకుండాం. అందల ఒక్కడు జారిపోయిండు. మనం ముగ్గురవంటే నాలుగు రూకలో, జమీనో ఉన్నవోళ్ళం. గణేష్ అమ్మ అయ్యలు ఏం లేనోళ్ళు. యాదగిరి నీ బాంచన్జెప్పి కాల్మొక్కతే కదా కన్నోడితో సమానంగ చదివిస్తుండవు? మన పిల్లగాండ్ల దోస్తనే కదా వాళ్ళను అలగలగ చూడకుండ సాయం చేస్తుండాం?" నల్లయ్య తువ్వాలుతో కళ్ళు వత్తుకున్నాడు.

"ఠీక్ మాట్లాడినావు సేటు. మరి దిమాగున్నోడు చేసిన పనికాదు వానిది. పోరండ్లను మంచిగ ఇస్కూలుకు పొండ్రా అంటే సంఘాలంటరు, ఎలక్షన్లంటరు, రాజకీయాలంటరు, జండాలు పట్టుకు ఉరుకుతవంటరు. వాళ్ళకు ఆవేశమెక్కువ. ఉడుకు రక్తంతో ఉంటరు. పాఠాలు చెప్పే పంతుళ్ళు గట్లనే ఉండ్రి. ఆళ్ళవెనకనే మన పిల్లగాండ్రు లోకమట్లయినాది."

నర్సిరెడ్డి మాటలకు సిద్దప్పకు కోపమొచ్చింది. "ఏంది రెడ్డి ఎవళ్ళనో ఏదో అనేకన్నా నువ్వు సోచాయించరాదు? పంచాయితీ ఎలచ్చన్లప్పుడు నీ బిడ్డని గడపగడపకు తిప్పలేదా? ఆయన్తోబాటు మా వాళ్ళు తిరిగిండ్రు. ఒక దపా గిట్ల తిరుగుడు శురూ చేసినాక ఊరుకుంటరా. కాలేజీలో ఎలక్షన్లంటూ దిగ్రిని. అక్కడితో ఆగ్రినా అంటే లేదే. మహేందర్ రెడ్డి కాలేజీల లీడరనిపించుకునే వరకు నువ్వాడనే ఉంటివి"

నర్సిరెడ్డి సిద్దప్ప వైపు చురుక్కున చూసాడు. "గట్లయితే తప్పు నాదంటవు? పిల్లగాండ్లు లీడర్లవ్వకుండ అట్లే ఉంటే రేపటికి నాయకులెవరుంట్రు? నేనేం తప్పు చెయ్యలా. నేనూ ఆ వయసులోనే రాజకీయాల్లోకి వచ్చినా. చదువుకున్నోళ్ళని, దిమాగున్నాళ్ళని అడుగు. నేను చేసింది తప్పంటే ఈ రాజకీయాలు వదిలేస్తా. నా కాలంలో నేను చదువుకున్నది వానాకాలం చదువే. గేదో గిట్ల సమాజ సేవ చేస్తుండా. నా కొడుకు ఇంజనీరింగు వరకు వచ్చినాడు. చదువుకున్నోళ్ళు నాయకులైతే ఈ దేశం బాగుపడుతుందని ప్రెసిడెంటు, ప్రధానమంత్రులే అంటిరి."

మరో పెద్ద మనిషి చెయ్యి గాల్లో అడ్డంగా ఊపాడు. ఆయనకు వయసు చేత పళ్ళన్నీ ఊడిపోయాయి. ఆయన ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తోన్నట్లు దవడ ఎముకలు నాలుగైదు సార్లు కదిలాయి. నర్సిరెడ్డి ఆయన్ని చూసి రెండు చేతులు కలిపి నమస్కరిస్తూ అన్నాడు "ఏంది రాజయ్య తాత? నువ్వేందో చెప్పాలనుకుంటున్నా వౌవు? చెప్పరాదు?"

రాజయ్య తాత మాట కూడదీసుకున్నాడు. "గది సరైన ముచ్చట గాదులే పటేలు. రాజకీయ నాయకులవ్వండ్రి, దేశాన్నేలండ్రి, ఎవ్వరు కాదనలే. మద్దెల ఈ సావులేంది? దీన్ని ఆపేటోడు లేడా? గణేషు ఎంత తెలివైనోడు! జిల్ల మొత్తానికి ఫష్టొచ్చినోడు. వాన్ని

చదువుల ప్రభుత్వ సాయం గూడ ఉన్నది. అట్టాండోడు దేశానికి ఎంతనో పనికొస్తడని మీతింగల కూడా చెప్పినారు. మరి ఆడి తెలివి బూడిదల వోసినట్టేనా? ఈ నడిమిట్టి సావులకు జమ్మేదారి ఎవిరిది?"

రాజయ్య తాత ప్రశ్న సూటిగా బాణంలా తగిలింది. కూర్చున్నవాళ్ళందరూ ఆ మాటలకు ఔనన్నట్లు తలలూపారు. నర్సిరెడ్డి వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు.

నల్లయ్య కుర్చీలో ఆవేశం వచ్చి ఊగిపోతూ అన్నాడు. "ఏంది పటేలు, గమ్మునుంటివి? గామ్‌కు పెద్ద, నువ్వెట్లు చెబితే అట్లే వోతాం. పిల్లల్ని చదివించాలా వద్దా? దినాం పేపర్ల చూస్తున్నం, టీవీల్ల చూస్తున్నం - వాళ్ళు పోయారు, వీళ్ళు పోయారని."

నర్సిరెడ్డి అందుకున్నాడు. "గట్లెందుకు గరమౌతవు? గా ముచ్చట్లు చుస్తున్నవుగదా? ఏం చేసినవు? నీ బిడ్డని చదువు మాన్పించినవా? ఈ దినం గణేష్ సచ్చిండు గనక నీకు యాదొచ్చింది. ఆళ్ళను చదివించాల్నా మానాల్నా అంటుంటివి. ఇది మినిట్ల తేల్చే సమస్యకాదు. నక్సలైట్ల ఉద్యమాలు చూస్తోంటిమి, మిలెటంట్లను చూస్తోంటిమి, గెరిల్లా యుద్ధాలంటోండ్రు. దానికోసం ఆత్మాహుతి దళాల కింద మారి ఉన్న జనాల్ని సంపుతుండ్రు. గిట్ల జేస్తే సర్కారులో భయం పుట్టుకొస్తదంటరు. వాండ్లు జనాల్ని చంపడానికి ఆత్మాహుతి దళాలైతే మన పిల్లలు బలిదానాలంటూ వాండ్లకు వాండ్లే ప్రాణాలు తీసుకుంటుండ్రు. గిట్ల జేస్తే సర్కారు దిగొస్తదని వీళ్ళ నమ్మకం. నమ్మకమెట్లున్న చనిపోయినవాడు తిరిగి రాడు గదా! రేపటి దినాం ఈ ప్రపంచకమెట్లున్నదో, ఏం జరుగుతున్నదో వానికి తెల్వదు కదా! గింత మాత్రం సోచాయించరు."

జనం నర్సిరెడ్డి మాటలక్కూడా తలలూపారు. ఒకళ్ళ తరువాత ఒకళ్ళు మాట్లాడుతున్నారు. మధ్యలో లక్ష్మి పాండ్రయ్య చేత చాయిలు పంపించింది.

రాత్రి పదకొండు దాటింది. "పదండి. ఒక దఫా చూసొద్దం గెట్టున్నరో ఏందో!" అన్నాడు నర్సిరెడ్డి కుర్చీలోంచి లేచి. ఊరి జనం కూడా లేచారు. ఊరి మొగలు గల్లీలో రావిచెట్టు దగ్గరకు చేరేసరికి గల్లీపోళ్ళందరూ అక్కడే ఉన్నారు. ఇప్పుడు ఎంకటమ్మ ఏడుపు వినపడటం లేదు. నిశీధి నిశ్శబ్దంలో సన్నటి మూగులు మాత్రం స్పష్టంగా వినిపిస్తోంది. వీధి లైటు బల్బు మాడిపోయింది. ఇళ్ళలోంచి తీసుకొచ్చిన లాంతర్లు నాలుగైదున్నాయక్కడ. "ఆ లచ్చుమయ్య దీపం బుడ్లు మాడిపోతే మార్చట్లేదా?" అన్నాడు నర్సిరెడ్డి గట్టిగా.

లచ్చుమయ్య అక్కడే ఉన్నాడు. చేతులు కట్టుకుని ముందుకొచ్చి నిలబడ్డాడు. "సారు.. బుడ్లయిపోయినయయ్యా. గుమాస్తాకు చెప్పినా. నడిమిట్ల టక్కులు రావు, పైసల్ జమైనాక పటేల్‌కు చెప్పి కొండమన్నడు."

"ఏందిరా మాటకు మాట చెప్తండావు? రేపు నా తాన పైసల్ దీస్కపో. ఊర్ల అన్ని దీపాలు వెలగాల. సమజైందా?"

"గట్లనే ఏస్తన్ దొరా." చేతులు జోడించాడు లచ్చుమయ్య.

"మనింట్ల గాసు లైటుంది నేనిమ్మన్నాని ఎత్తుకురా." లచ్చుమయ్య ఉరికాడు.

"ఎంకటమ్మా ఇంట్లకు పోయి జర్ర కునుకు తీయరాద? బాద నట్లాగే ఉంటది. మేం ఎవులం కాదన్లేం. రేపు గణేష్‌ని చూసినాంక గుండెలు పగుల్తయి. వానితో బాటు నీ పానాలు పోకున్నుండలంటే కాసింత ఆరామ్‌గా ఉండాల."

ఎంకటమ్మకు బాధ ఎగదిసింది. "ఓరి బగమంతుడోయ్! నా పానాలు తీస్కపో దేవుడా. నా బిడ్డ పానాలు తెచ్చియ్యరో దేవుడో.. దేవుడా.." నిశ్శబ్దంలో కిచురాయి శబ్దాన్ని వినబడకుండా చేసింది ఆమె రోదన.

శంకరయ్య అన్నాడు., "పటేలు నువ్వు పరిషానవ్వక గమ్మునుండు. మేమందరం లేమా? మరో జాముకి ఆ యమ్మే నెమ్మలంగుంటది. చెట్టంత కొడుకుపోయిన్నంటే మనసుకు బాద పట్టకుండా ఎట్టుంటది. ఆ యమ్మ పెనిమిటి ఇంతదాకా రాలేదాయె. అది కూడా గుబులౌతది. బందుగులైతే తోడుంటిరి. ఆమెకు దైర్నమిస్తానికి మావంతా ఈడనే ఉంటిమి."

గల్లీలో ఆడ మగ ఎంకటమ్మను సముదాయించసాగారు. ఇంతలో లచ్చుమయ్య గాస్ లైటు తీసుకొచ్చాడు. లైటుతో బాటు మరో భయంకరమైన వార్త మోసుకొచ్చాడు.

"పటేలు సారూ మీ ఇంట్ల ఆడవాండ్లు గోల చేస్తుండ్రు, అమ్మ నిన్ను తోలుకు రమ్మన్నది."

"గేమైందిరా! గిప్పుడ్నే గదరా వస్తిమి!"

"మన సిద్దప్ప ఇంటామె కింద పడినాదంట. కాలు చేతులు గుంజినాయంట. వాల్ల బిడ్డ ముత్యాలు ఎడస్తా ఉంది."

"ఎవరు? సరస్వతమ్మేనా. సరిగ్గా ఇనుకుంటివా?" అన్నాడు సిద్దప్ప కంగారుగా.

"అవుదొరా. నే చూస్తిని గద. మీ ఇంటామె. కాలు చేతులు గుంజుకుంటా వుంది. తల పక్కకు వెట్టి ఎటో చూస్తా ఉంది."

"నీ యవ్వ, ఏం మాట తీసుకొచ్చినవ్రా! రండ్రి గదేందో చూసుకొద్దం." లచ్చుమయ్య ముందు నడుస్తోంటే గాస్ లైటు వెలుగులో జనం నడిచారు. నర్సిరెడ్డి ఇంటి దగ్గర ఆడవాళ్ళ గోల ఎక్కువగా ఉంది. నర్సిరెడ్డి ఇల్లు చేరగానే ఆడవాళ్ళు చీకట్లో తప్పుకున్నారు. లక్ష్మితో పాటు నర్సిరెడ్డి, సిద్దప్ప, వెనుకనే పట్టినంత జనం వెనుక సావిట్లోకి వచ్చారు. లచ్చుమయ్య చెప్పినట్లు సరస్వతి నేలపై పడివుంది. మూతి వంకర కాళ్ళమీదకు తీసుకున్నాడు. "ఏంది సరస్వతీ! గిట్ల వడినావు? కాలు నొస్తోందా? ఏంది భాధ? చెప్పు సరస్వతీ!" అంటూ బావురుమన్నాడు.

సరస్వతి కళ్ళలోంచి నీళ్ళు ధారలుగా వచ్చాయి. సిద్దప్ప మతిపోయిన వాడిలా వంకర పోయిన మూతి, కన్ను వంక చూస్తున్నాడు. ఆమె ఏదో చెప్పడానికి ప్రయత్నించింది. నాలుక సహకరించడం లేదు. అతి కష్టం మీద అంది, "రంగప్ప ఏ..డ్న? రా..డా?"

సిద్దప్పకు అర్ధమయింది. సరస్వతి కొడుకు రంగప్ప గురించి తీవ్రంగా ఆలోచించింది. అసలే రక్తపోటు మనిషి, తట్టుకోలేని ఆలోచనలు పక్షవాతంలోకి దింపాయి. "ఇప్పుడేం చేద్దాం పటేలు?" అన్నాడు దీనంగా.

నర్సిరెడ్డి గట్టిగా కేక వేసాడు. "ఒరే పాండ్రయ్యా మీ నాయన్ను జల్దీ బండి కట్టమను."

పాండ్రయ్య పసువుల కొట్టాం దగ్గరకు ఉరికాడు. వాడి నాయన ఏసుపాదం కొట్టం పక్కగా ఉన్న గుడిసె బయిట చాపమీద చుట్టకాలుస్తూ కూర్చున్నాడు. పాండ్రయ్య నాయన దగ్గరకు వచ్చి రొప్పుతూ చెప్పాడు. "దొర బండి తియ్యమన్నడు. సిద్దప్ప ఆయనామె లేదూ, ఆమెకు కాల్లు, చేతులు వంకర బోయినయి. దవాఖానకు తీస్కపోతుండ్రు."

"నడిమి రేతిరి దాటింది, ఇప్పుడు దీస్కపోవాల్న? " "బండి తోలుకు రమ్మని చెప్పిను." ఏసుపాదం, చుట్ట విసిరేసి చిరాగ్గా లేచాడు. ఎడ్లను విసుక్కుంటూ అదలించాడు. బండెడ్లు అదిలింపుకు లేచి నిలబడ్డాయి. చమ్కీ దెబ్బలకు పేడ కళ్ళు వేసి, ఉచ్చలు పోసాయి. ఏసుపాదం కాడి ఎత్తి పట్టుకుంటే బుద్దిగా మెడలు కిందికి దూర్చాయి. బండిలో వత్తుగా గడ్డినింపి గోనె పట్టాని పరిచాడు. బండిని తీసుకువచ్చి నర్సిరెడ్డి ఇంటిముందర నిలబెట్టాడు

మగాళ్ళు సరస్వతిని లేవబట్టి బండిలోకి చేర్చారు. "నేనూ వొస్తా నాయినా." అంది ముత్యాలు.

"ఎక్కువమ్మా, అడిగేదేంది. ఆడవాండ్లకు ఆడవాండ్లే సాయముండాల" అన్నాడు నల్లయ్య. సిద్దప్ప చేయందిస్తే ముత్యాలు ఒక్క ఉదుటన బండెక్కింది.

"దవాఖానాకు ఇంకెవలు పోయేది?" అడిగాడు నర్సిరెడ్డి. ఒకళ్ళు మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు.

"నల్లయ్య నువ్వు పోరాదే?"

"మడిసికి మడిసికి అవుసరాలుంటయి, కాదన్ను పటేలు. తెల్లారంగానే కిరాణం దుకానం తియ్యకుంటే ఊర్ల జనాలికి కష్టమౌతుంది. రేపు దినం ఎట్లయిన పట్నం మార్కెట్టుకు పోవాల. ఆ టయామ్ల నేను దవాఖానాకు పోయెస్తా."

"గా ముసిలాయిన శంకరయ్యేడ్నున్నాడు. ఆయన్ని తోలుకుపొండి. పెద్దమడిసి, అన్నీ తెలిసినోడు. మంచిగుంటది."

"ఓయ్ శంకరయ్యా. గిట్రా." ఏసుపాదం అరుపుకు గుంపులోంచి శంకరయ్య ముందుకొచ్చాడు. "దొర దవాఖానకు పొమ్మంటుండు. గాడెక్కుతావు?"

"నన్ను పొమ్మంటివా పటేలు?" అనుమానంగా అడిగాడు.

నర్సిరెడ్డి జేబులోంచి వంద రూపాయల నోటు తీసి శంకరయ్య చేతిలో పెట్టాడు. "పెద్ద మడిసిని. నువ్వు జర్ర నిలవడ్డవంటే చాలు. ఆయనకు దైర్నమొస్తది."

"కాదు పటేలు, రేపు దినం గణేష్‌ను తెస్తరు. బొందల కాడికి పోవాల్న."

"నువ్వీడుంటే మంచిగుంటది. ఏం చేసేటిది! కష్టాలన్నీ ఒకే దఫా వచ్చినయి. దవాఖాన తానకు నేన్పోతే ఇక్కడ గామ్ అంత ఉల్టాసీద అవుద్ది. నువ్వు బో. రేపు పొద్దు గుంకే వేళకు వాపస్‌రా. సిద్దప్ప ఈ లెక్క నీ తానుంచు. మంగ వొచ్చినంక తీరుద్దువులే." మరికొన్ని వందనోట్లు సిద్దప్ప చేతిలో పెట్టాడు.

నర్సిరెడ్డి రెండు చేతులు పట్టుకుని కళ్ళకద్దుకున్నాడు "నువ్వు గామ్‌కు పటేలువు గాదయ్యా, మంచి స్నేహితుడవు."

"ముంగల గాడెక్కు, ఆలీసం చెయ్యమాక, దవాఖానలో డాక్టరుకు నా పేరు జెప్పు. పటేల్ పంపినాడంటే మంచిగ చూసుకుంటడు. ఏసుపాదం, పోనీరా బండిని. మోటర్ గాడీ లెక్కన ఉరకాల. గుంటల్తాన జర్ర నెమ్మలంగ పోనీయ్."

ఏసుపాదం బండిని పోనిచ్చాడు. ఊరి జనాలు మెల్లగా ఇళ్ళదారి పట్టారు.

●●●

**ఉదయం పదిగంటలయింది.**

నర్సిరెడ్డి ఫోన్ చేసి రెండు టెంట్లు తెప్పించాడు. ఒకటి ఎంకటమ్మ ఇంటిముందర మరొకటి గ్రామ చావిడి దగ్గర వేయించాడు. వంద ప్లాస్టిక్ కుర్చీలు గ్రామ చావిడి టెంటులోను, రావి చెట్టు కింద పరిపించాడు. దాహత కోసం నాలుగు డ్రమ్ముల నిండుగ మంచినీళ్ళు పట్టించి ఇద్దరు మనుషుల్ని పెట్టాడు. అన్నదానానికి రెండు సంచుల బియ్యం గోడౌన్లోంచి తెప్పించాడు. నల్లయ్య బాగుండదని పాతిక కేజీలు కందిపప్పు, తాలింపు సామాన్లు ఇచ్చాడు. ఊరిలో ఎంతో కొంత ఉన్నవాళ్ళు తోచిన సాయంగా కూరలు, కిరాణం సామాన్లు తీసుకొచ్చారు. పక్కూరి నుండి వంటమనిషి వస్తే ఆడవాళ్ళు సాయానికొచ్చారు.

స్కూలు పంతులు వస్తే తాళాలు తియ్యొద్దని చెప్పి స్కూలుకు సెలవిప్పించాడు. రాజయ్య పంతులు తెల్లబోయాడు. "ఏంది పటేలు సాబు! గణేష్ ఎందుకు పానాలు తీసుకుండు? నువ్వు చూసినావా?" అన్నాడు నమ్మలేనట్టు.

"పోలీసోండ్లు చెప్పిండ్రు, గణేష్ ఉద్యమానికి ప్రాణాలు బలిదానం చేసినాడని శవాన్ని తీసుకొస్తమని కూడా చెప్పిండ్రు. సర్కారు అబద్దం చెప్పదు. వాళ్ళ మాటమీద ఈ ఏర్పాట్లన్ని చేసినాం."

రాజయ్య పంతులు దిగాలుగా చతికిలబడ్డాడు. పంతుల్ని చూసి స్కూలు పిల్లలు దగ్గరకొచ్చి "సారూ ఇస్కూలు బందు చేసినవ్వా?" అని అడిగారు.

"ఔ. పటేల్ సాబ్ చేయించిండు"

పిల్లలు ఒక్కసారిగా సంతోషంతో ఘొల్లుమన్నారు. పెద్దవాళ్ళు కసురుకుంటే గమ్మునున్నారు.

"రోడ్డుమీద ఆడకండ్రి. ఇళ్ళకు పోండ్రి" అన్నాడు పంతులు.

"మా ఇంట్ల ఎవ్వలు లేరు. అందరు ఈడ్నే ఉంటిరి." అన్నారు సంతోషంగా. పంతులు సీరియస్‌గా ఉండటంతో పిల్లల ఉషారు తగ్గింది. "గణేషన్న మన ఇస్కూలులో చదివిన్నంటగదా సారు?"

"ఔ బిడ్డా! మన స్కూల్లోనే చదివిండు. నా చేతుల్లో మంచి స్టూడెంటుగ పెరిగిండు. వానికి అక్షరాలు నేర్పించింది నేనే. వాడు పెద్ద చదువుకు పోయినప్పుడు వాని అమ్మా నాయన్ల కంటే, అందరికంటే నేనే ఎక్కువ సంతోష పడితిని. ఈ స్కూలు షురూ చేసినప్పటినుండి ఈడ నేనే పంతుల్ని. గావ్‌ల వాడు నా మొదటి విద్యార్థి. ఈ పటేలు మంచిగ పట్టుబట్టి సర్కారుతో మాట్లాడి, మినిష్టర్ల చుట్టు తిరిగి గవర్నమెంటు స్కూలు పెట్టించినాడు. పటేల్ మాటతోనే ట్రాన్సఫర్ వచ్చినా ఆయన మీద ఇజ్జత్‌తో పనిచేస్తుండా. నలుగురు పిల్లలతో షురు అయిన స్కూలు పాతికమంది పిల్లకాయల్తో నడుస్తావుంది. మొదటి నలుగురు పిల్లలు నాలుగు రత్నాలు బిడ్డా. ఒక రత్నం జారిపోయింది. బలిదానం చేసిన్నాట్ట - బలిదానం. ఎవరికోసం? రెక్కలు విరుచుకుని కష్టపడి వాన్ని పైకి తీసుకొస్తున్న అమ్మ అయ్యల గురించా? అఆలు దిద్దించి, ఒక్కో మెట్టు ఎక్కించి 'నీలో గాంధీని చూస్తున్నా బిడ్డా - నెహ్రూను చూస్తున్నా' అనుకుంటూ కోటి ఆశలతో ఈదేశానికి ఒక చిన్న పంతులు పెద్ద కానుక ఇచ్చాడని అందరూ అనుకుంటే సంతోషపడాలనుకునే నా గురించా? ఈ గావ్‌కు పదిమంది పటేళ్ళు పెట్టు అవుతడనుకుంటి. ఇలాగవుతుందని నేనెప్పుడూ అనుకోన్లే." తన స్కూలు పిల్లల ముందు బాధను వెళ్ళగక్కాడు పంతులు.

అప్పటి వరకూ నవ్వులాటగా ఉన్న పిల్లలు పంతులు మాటలకు కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. పిల్లలతో ఉన్న పాండ్రయ్య అడిగాడు, "బలిదానం అంటే ఏంటి పంతులు సారు?"

పాండ్రయ్యకు రాజయ్య పంతులు దగ్గర చనువుంది. ఉదయం స్కూలు దగ్గర మైదానంలో పసువుల్ని మేపేటప్పుడు పాండ్రయ్య స్కూల్ వరండాలోనే కూర్చుంటాడు. పంతులు పాఠాలు చెబుతోంటే ఆశక్తిగా వినేవాడు. పంతులు వాడి ఉత్సాహానికి సంతోషపడి పలకా బలపం కొనిచ్చాడు. బడికొచ్చే ఉచిత పుస్తకాల్లోంచి అక్షరాల పుస్తకం ఇచ్చాడు. ఇప్పుడు పాండ్రయ్యకు అక్షరాలు రాయడం, కొద్దిగా కూడబలుక్కుని చదవడం వచ్చింది. రాజయ్యకు అనిపించేది వీడు మరో గణేష్ అవుతాడని.

పాండ్రయ్యను దగ్గరకు తీసుకుని తలమీద చెయ్యివేసి అనునయంగా అన్నాడు రాజయ్య పంతులు, "పాండుగా నువ్వు అక్షరాలు నేరుస్తనంటే సంతోషంగ నేర్పినాను. పుస్తకం పట్టించినాను. చదువుల తల్లి నీతో జతకడతా ఉంటే ఆనందంతో పొంగిపోయాను. గణేష్‌ని కూడా నీ లెక్కన కొత్తగా భూమిలోంచి మొలకేసిన విత్తులా సాకినానురా. వాడు మానుకట్టినమావిడిలా నిండుగా ఫలాలనిచ్చే దినం కోసం చూస్తావుంటిని. నేను ఒక్కడికి విద్య నేర్పితే వాడి పదిమందికి నేర్పి పైకి తీసుకొస్తడని, వానక్కనికి దాహత తీరిస్తే లక్షల మందికి జీవనదౌతాడని ఆశపడ్డానురా వాని ఆలోచన్లు మరోదోవ పట్టినయి. అందరాకలి తీర్సలంటడు, స్వతంత్రం అంటడు, సమాన హక్కులంటడు -- ఏదైనా అంటడు. అన్నిటిని తేలిగ్గ బలిదానంతో సాధించాలనుకున్నడు బిడ్డ."

"అదే సారు నాకు తెల్వకుండే బలిదానం వంటే ఏంటి?"

"నాకూ నీ లెక్కనే సమజౌతల్లే బిడ్డా. పదిమంది మంచికోసం పానాలు తీస్కోడం అని సెప్తుండరు నాయకులు, మేధావులు. గిప్పుడే గడ్డాలు మీసాలు మొలుస్తోన్న కాలేజి పిల్లలు దానికి మరి కొన్నర్థాలు తగిలిస్తున్రు. వారి లెక్కన బలిదానవంటే ధైర్యం, తెగింపు, హీరోయిజం, జాతిపిత అంత ఎత్తుకు ఎదిగినవన్న భావన. మనల్ని పరిపాలిస్తోన్న లీడర్లు చెయ్యలేని సాహసాన్ని తామే చేస్తున్నావన్న గొప్పదనం, యువత ఏ పనైనా చెయ్యగలదు దేన్నైనా సాధించగలదు అని నిరూపించాలన్న భావోద్వేగం. ఇవన్నీ కలబోసి బలిదానమయింది బిడ్డా."

పాండ్రయ్య పంతులు చెప్పేది ఇంకా అర్థంకానట్లే చూసాడు. "ఇంక నీకు నేను చెప్పదేంది లేదు కానీ నాకు అంత దాక తెలుసు. తెల్సింది చాలా ఉన్నది. బలిదానంకు ముందెనుక రాజకీయ శక్తులుంటయి, జండాలుంటయి, జైకొట్టుడులుంటాయి, పొగడ్తలుంటయి, లాఠీఛార్జులుంటయి, జైళ్ళుంటయి. వీటన్నిటి మధ్యన మనిషి ప్రాణం తియ్యడానికి పుట్టుకొచ్చిన విషపు మొక్కరా బలిదానం. వీటిని దాటుకుని బయటపడే సత్తా మన యువతకు లేకపోతోంది. మన విద్యార్థులు జండాలు పట్టుకుని నలుగురు జులూస్

చేస్తే మొదటివాడు నేలకొరుగుతడు, రెండోవాడు ప్రాణాలు తీస్కుంటడు, మూడవ్వాడు జైలకెల్తడు, నాల్గవ వాడు రేపటి నాయకుడౌతడు. ముగ్గురు పోతేగానీ నాల్గవ వానికి పట్టు దొరకదు. ఏందిరా నీకింకా సమజ్ కాలే? పోయిపని చూస్కో నాయినా. నేనిచ్చిన పలకా, పుస్తకం స్కూల్ల గిరాటువెట్టి నీ పని జూస్కో. లేకుంటే రేపు నువ్వేమౌతావోనని నాకు ఈ రోజునుండే దిగులు." పంతులు పిచ్చి పట్టిన వాడిలా పాండ్రయ్యను దూరం తోసేసాడు.

నర్సిరెడ్డి దూరం నుండి రాజయ్య పంతుల్ని గమనిస్తున్నాడు. పంతులు దగ్గర పదిహేనేండ్లు చదువుకున్న గణేష్ పట్ల ఆయన ప్రేమ అనంతమైనది. తల్లి కొడుకుని ఎంతగా ప్రేమిస్తుందో, ఉపాధ్యాయుడు మంచి విద్యార్థిని అంతగా ప్రేమిస్తాడని చెప్పడానికి రాజయ్య పంతులే ఉదాహరణ. గణేష్ మరణ వార్తతో ఆయనకు మతి స్థిమితం తప్పింది. నర్సిరెడ్డి రాజయ్యను కిందనుండి లేపి టెంటుకింద కుర్చీలో కూర్చోబెట్టాడు.

రాజయ్యకు కళ్ళు తిరిగి చమట్లు పట్టాయి. మంచినీళ్ళు తెప్పించి మొహం మీద చిలకరించాడు నర్సిరెడి. కాఫీ ఇచ్చి "కాస్త తావి రెస్టు తీసుకో పంతులూ. మరీ ఎక్కువగా ఆలోచించమాకు. జరిగిందేదో జరిగిపోయింది. మనం ఇప్పుడు ఆపేటిది కాదు" అన్నాడు.

ఊరి జనం గ్రామ చావిడి దగ్గర చెట్టుకింద గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. పోలీస్ జీప్ దూసుకుంటూ వస్తూ అంత దూరంనుండే కనపడుతోంది. దగ్గరకు రాగానే జనం చుట్టూ మూగారు. ఎస్.ఐ జీపు దిగకుండానే అడిగాడు, "మీ పటేల్ ఏడున్నడు?" అని.

"ఏర్పాట్లు చూస్తుండు."

"రాత్రి గావ్‌ల గొడవలేం లేవుగదా?"

"గొడవలెందుకు సారు?"

"నన్నడుగుతవేంద్రా! అయితే ఆయనయని చెప్పు, కాకుంటే మంచిగున్నవని చెప్పు. నీ పేరేంది?"

అతను కంగారు పడ్డాడు. "నాకేం తెల్వ. మా పటేల్నడుగు సారు!"

"గా ముచ్చట ముంగల చెప్పరాద? సర్కారుతో పరాచికాలాడుతున్నవు. జల్ది పటేల్ను పిల్వు."

నర్సిరెడ్డి జనాల్ని తప్పించుకుంటూ జీపు దగ్గరకొచ్చి ఎస్.ఐ.తో చెయ్యికలిపాడు. "సారు ఇంక ఎంత టైం వడద్ది? పోస్టుమార్టం అయినాదా?"

"హాస్పట్ల డాక్టర్లు రావాల, కలెక్టరు రావాల, ఆఫీసర్లు రావాల, పోలీస్ బందోబస్తు కావాల్న. టైం వడద్ది. ఊర్ల ఎట్లున్నదో చూసిపోదామని వచ్చినా. అంత మంచిగుంది కదా? ఏవైనా గొడవలుంటే చెప్పు పటేలు. బందోబస్తు ఎంతకావల్నో ఎస్పీకి ఫోను కొట్టాల."

"మా గావ్‌లో ఏం కొట్లాటలు లెవ్వు. మేవందరం ఒక్కతీరునుంటం. కొట్లాటలతో పనేంది. ఆయన చనిపోయిండు. అన్ని క్లాస్ల ఫస్టున వచ్చి మంచిగ చదువుకుంటొన్న వోడు మద్యల అన్యాయమైపోయిండని మావంత ఒకే తీర్న బాదపడుతున్నాం. పట్నంలో ఉన్న రాజకీయాలు మాతాన లేవు."

"ఠీక్ హై పటేల్ సాబ్. పట్నం నుండి లారీల్ల, బస్సుల్ల స్టూడెంట్లు, లీడర్లు వస్తరని స్టేషనుకు ఫోను చేస్రను. వాళ్ళంబడి పోలీసు బెటాలియన్లు కూడ వస్తయి. ఎస్పీ సాబ్ కూడా వస్తుండు."

"అంతమంది ఒస్తే మేవేం చెయ్యగలం! నిన్న రాత్రినుండి మావాళ్ళందరు నిద్దర్లు లేక ఈడ్నే ఉంటిరి. అన్ని గుమ్మాలకి తాళాలు వడ్డవి. మా వాళ్ళకోసం రెండు సంచిల బియ్యం వండిస్తున్నా. మీ ఠాణావోళ్ళంటరా మా వాళ్ళతో గలుస్తరు. ఇంతకన్న చెయ్యాలంటే సర్కారోళ్ళే ముందుకు రావాల్న." నర్సిరెడ్డి నిష్కర్షగా చెప్పేసాడు.

ఎస్.ఐ, ఎక్కువ మాట్లాడలేదు. జనాన్ని పక్కకు జరిపించి జీప్‌ను వెనక్కు తిప్పించాడు.

జీపు రోడ్డు మలుపు తిరిగిందో లేదో అటునుండి గ్రామీణ బస్సు వచ్చింది. రోజూ అయితే నర్సిరెడ్డి ఇంటివరకూ వచ్చి ఆపుచేస్తాడు డ్రైవరు. ఊరి జనమంతా గ్రామ చావిడి దగ్గర రోడ్డుకడ్డంగా ఉండటం వల్ల బస్సు అక్కడే నిలిపాడు. బస్సులోంచి దిగేవాళ్ళని పరిక్షగా చూస్తున్నారు నర్సిరెడ్డి, నల్లయ్య. వాళ్ళ పిల్లలు బస్సు దిగితారేమోనని ఆశ. పిల్లలు బస్సు దిగలేదు.

దిగిన పది మందిలో మధ్యనున్నాడు యాదగిరి. తల ముగ్గు బుట్టలా ఉంది. మొహం నల్లగా ఉండి రాత్రంతా నిద్రలేనివాడిలా పీక్కుపోయి జిడ్డోడుతో ఉంది.

కొడుకు మరణం నిన్న రాత్రి పదింటికి తెలిసింది. గంటసేపు తట్టుకోలేని బాధతో ఏడ్చాడు. మనసు గట్టి చేసుకుని, పెద్ద మేస్త్రీ దగ్గర డబ్బులు తీసుకుని బస్సు స్టాండుకు వచ్చేసరికి చివరి బస్సు వెళ్ళిపోయింది. పొద్దుట ఎనిమిదింటి వరకూ అక్కడే కూర్చుండిపోయాడు.

తెల్లవార్లూ చెట్టంత కొడుకు కళ్ళముందు తిరుగాడుతోన్నట్లే ఉన్నాడు. వాడ్ని భుజాల మీదకు ఎక్కించుకుని పొలం గట్ల మీద తిప్పిన రోజులు, బడిలో పంతులు దగ్గర చదువుకుంటూ, ఆ దారిన పోతోన్న తనకు టాటా చెప్పిన రోజులు, కాలేజీ చదువుకంటూ బస్సెక్కి వెళిపోతోంటే కిటికీలోంచి కనపడే కొడుకు మొహాన్ని చూస్తూ వెనుకే వడివడిగా అడుగులేసిన రోజులు గుర్తుకొచ్చాయి.

”గణేషుగాడ్ని పంపేసినాను. దూరంగా పంపేసినాను. చమటోడ్చి పైసలు సంపాదించి వాని చేతల్ల వోసి మరీ బలవంతాన పంపేసినా. కన్నీళ్ళు కారుతోన్నా, కాళ్ళు బస్సెనక పరుగెడుతోన్నా అదుపు చేసుకుని వాన్ని పంపేసినా. నేను దుర్మారగుడ్నిరా గణేషు. పెద్ద చదువుల ఆశ చూపినాడు పంతులు. గొప్ప తెలివైనవాడవౌతవని ఆశలు రేపినాడు పటేలు. రేపటినుంచి నీ కొడుకు గనేషు కాదురా యాద్గిరీ, నిన్నే గణేష్ నాయనంట్రా, వాడు నీ జాతకం మార్చేస్తడ్రా అనిండ్రు ఊరిజనం. అప్పుడు నమ్మలేదురా గణేషు. ఇప్పుడు నమ్ముతున్నా. నా కొడుకు గణేష్ కాకుండా పోయిన్రా.” పిచ్చిగా తనలో తానే గొణుక్కుంటూ ఏడుస్తూ గడిపాడు తెల్లవార్లు. యాదగిరిని రాత్రంతా కళ్ళు పొడుచుకు పోయేలా, మొహం పీక్కుపోయేలా ఏడవనిచ్చి ఉదయం ఆ కట్టెను మోసుకువచ్చింది గ్రామీణ బస్సు.

బస్సు దిగ్గానే గావ్‌లో పెద్ద మనుషులు కనపడ్డారు. యాదగిరి కళ్ళలో ఇప్పుడు బాధలేదు, కన్నీళ్ళు లేవు. అవన్నీ ఇంకి ఆరిపోయాయి. రెండు చేతులు కలిపి పైకెత్తి అందరికీ నమస్కారం చేసాడు. నర్సిరెడ్డి యాదగిరిని తన బాహువుల్లోకి తీసుకున్నాడు ఊరడింపుగా. గొప్పవాడి చేతుల్లో ఇమిడిపోయాన్న సంతోషం లేదు. గొప్ప ఆశయాల సంకెళ్ళలో ఇరుక్కుపోయానన్న బాధ మాత్రం అతడి మొహంలో స్పష్టంగా కనపడింది.

”గణేష్ మనల్ని ఇంట్లా మోసం చేస్తడని అనుకోలేదు యాదగిరీ. మనల్ని అందర్నీ అన్యాయం చేసి పోయిండు. వానిమీద ప్రేమతో ఊరి జనం అంతా ఏట్ల ఎదురుచూస్తున్నరో చూడు. రాత్రినుండి మీ ఇంటామే ఒక్క తీరున ఏడుస్తున్నది. మీ గల్లీపోళ్ళందరు ఆమెకు ధైర్నం చెప్తున్రు. నువ్వు పోయి సమజాయించు. గణేషు శవాన్ని సర్కారు బండిల తెస్తరు. గంటకో, రెండు గంటలకో వస్తది. పోలీసులొచ్చి చెప్పి పోయిన్రు. నువ్వు ముంగల ధైర్యంగ ఉండాల. నువ్వు ఇట్ల అదైర్న పడితే ఆమె పానం ఎట్ల నిలుస్తది చెప్పు.”

యాదగిరి నోటమాటలేదు. బొమ్మలాగ చూస్తున్నాడు. నర్సిరెడ్డి చేతుల్నించి ఊరి జనం చేతుల్లోకి మారాడు. బరువుగా అడుగులు ముందుకు పడుతున్నాయి. కొద్ది దూరంలోనే కుర్చీలో కాళ్ళు ముడుచుకు కూర్చుని కళ్ళకు అడ్డంగా పై కండువాను కట్టుకున్న రాజయ్య పంతుల్ని చూసాడు. దగ్గర కాగానే కండువాను పైకి లేపి అడిగాడు యాదగిరి, ”ఏంది పంతులూ నా పిల్లగాడ్ని గొప్ప చదువులు చదివిపించి పైకి పంపేసినావా? కొత్తోళ్ళకు సదువు సెప్పడాన్కి పాతోళ్ళను పంపించేస్తుండావా?”

యాదగిరి సాధారణ విషయంలా అడిగాడు. ఇలా ఇదివరలో చాలా సార్లు మాట్లాడాడు. మొదటి సారి పంతులు గనేష్ చేత అక్షరాలు దిద్దిస్తున్నప్పుడు అడిగాడు ”పంతులూ నా కొడుకుచేత పలక పట్టించి నాకు ఒక కూలిదండగ చేస్తుండావు.” అన్నాడు నవ్వుతూ.

పంతులు అప్పుడు చాలా తీవ్ర స్వరంతో సమాధానమిచ్చాడు, "ఏంది యాదగిరి నీకు కూలి దండగని సోచాయిస్తుండావు. వీడు రేపటి దినాన లక్షలు లక్షలు దెచ్చి నిన్ను మారాజుని చేస్తడన్నది సమజౌతల్లా కూలి డబ్బులు ఒక్క దినాప్లు కడుపుల బోయి అరాయించుకు బోతాయి. వీనికి చదువు జీవితాంతం తోడుంటది."

చివరి సారి గణేష్ పదో తరగతి పాసైనప్పుడు "ఇప్పుడేమంటవు యాదగిరి? మీ పిల్లగాడు పట్నం పోయి చదివే దినమొచ్చినాది? వీన్ని కూలి పనిలో వెడ్తనంటివి. వీన్నసీబ్పై చదువులకు పోవాలనుంటే గట్లెందుకవుద్ది" అని రాజయ్య పంతులంటే "వాన్నసీబు నువ్వు బాగానే చేసినవు, మా నసీబు మరచినవు ఒక్కపూట కడుపు నింపుకోవడమే కష్టంగుంది మాకు. పట్నం చదువులంటే మేం ఏం దినాల్నె? వానికే పెట్టాల్నా?" అన్నాడు తను.

అప్పుడు కూడా పంతులుకు కోపమొచ్చింది. "నీ కొడుకు చదువుకోసం నువ్వు తిండి మానక్కల్లే. నేనున్నాను. మా పటేలున్నడు, ఈ గావ్ అంత వెనకుంటది. గణేష్ సూరీడు లాంటోడు. వాడి ముందు మనందరం దివిటీల్లాంటి వాళ్ళమే యాదగిరి. వాడికి సాయం చేస్తున్నాం అనుకుంటాం గానీ వాడి కాళ్ళమీద వాడే నెగ్గుకొస్తాడు" అన్నాడు ధీమాగా.

పంతులుకు ఇప్పుడు పాతజ్ఞాపకాలన్నీ వెంటాడుతున్నాయి. యాదగిరి ప్రశ్నకు కోపంతో జవాబివ్వలేకపోయాడు.

●●●

**"ఏంది పంతులు మాట్లాడవేంది?" రెట్టించాడు యాదగిరి.** పంతులు చటుక్కున రెండు చేతులు పట్టుకున్నాడు.

"ఈ దినం నేను కోపగించుకునేది కాదు యాదగిరీ. నీకు కోపం వచ్చి కళ్ళెర్ర జేస్తే బూడిదైపోవలసినోడ్ని. తప్పు చేసినా. నువ్వెన్ని సార్లు చెప్పినా గణేష్ పట్నం చదువులుకు పట్టువట్టినా. నన్ను క్షమించు" వలవలా కన్నీళ్ళు కార్చాడు.

యాదగిరి పేలవంగా నవ్వాడు. "పంతులూ.. నీ తప్పేంకాదు. ఇది ఎవళ్ళు చేసింది గాదు. వాన్ని బగమంతుడు తీసుకుపోయిండు. తెలివి గలోళ్ళు భూమ్మీద పన్లేదని తీసుకుపోయిండు. నీకింకా కన్నీళ్ళొస్తున్నాయి. వాడి నాయన్ను నాకింకినయి" పంతులు చేతులు విడిపించుకుని ముందుకు కదిలాడు యాదగిరి. సావాసగాళ్ళు, దగ్గరోళ్ళు, గల్లీపోళ్ళ గుంపుతో యాదగిరి ఇంటికి చేరాడు. ఎంకటమ్మ ఇంటిముందు జనం గ్రామ చావిడి దగ్గర ఉన్నవాళ్ళకు ఊరంటుకున్న మంటలా కనపడ్డాయి. ఎంకటమ్మ ఏడుపులు మంటల్లోంచి ఎగసిన గాలుపు ధ్వనుల్లా వినిపించాయి.

సూరీడు నడినెత్తి దాటి కొద్దిగా పడమటి ముహం పెట్టాడు. ఒంటిగంటయింది. పటేల్ ఇంటి దగ్గర వంటలు సిద్ధమయ్యాయి. నర్సిరెడ్డి చెప్పమన్నాక పాండ్రయ్య ఒక్కో మనిషి దగ్గరకొచ్చి నెమ్మదిగా చెప్పాడు, "దొర చెప్పిండు, వన్నాలకి రమ్మంటుండు" జనం పలచ పలచగా పటేల్ ఇంటికి బయలుదేరారు. యాదగిరి కుటుంబానికి కూడా కబురు చెప్పాడు. వాళ్ళందరూ తలలడ్డంగా ఊపారు. పాండ్రయ్య పరుగెత్తుకు వెళ్ళి నర్సిరెడ్డికి చెప్పాడు.

నర్సిరెడ్డి గదమాయించాడు. "నీ యువ్వ ఏందిరా వాళ్ళను పెండ్లికి పిలిచినట్టు చెప్పినావు? వణ్ణాలు తట్టల వెట్టుకుని ఆడకు తేవాల్న" పాండ్రయ్య అర్థమయినట్లు వేగంగా వంటల షెడ్డు దగ్గరకు దూసుకుపోయాడు. భోజనం ఇంటికొచ్చినా యాదగిరికానీ ఎంకటమ్మగానీ ముట్టలేదు. పక్కవాళ్ళ బలవంతంతో రావులు, చంద్రమ్మ గుడిసె లోపలకు పోయి ఎంగిలిపడ్డారు.

గ్రామం ప్రళయం ముందు ప్రశాంతంలా ఉంది. మధ్యాహ్నం మూడు గంటలయింది. పశ్చిమానికి జారిపోవాలని సూరీడు విశ్వప్రయత్నం మొదలయింది. గ్రామ ప్రజల దృష్టి అంత పశ్చిమాన్నుంచి గ్రామంలోకి ప్రవేశించే రహదారిపైనే ఉంది. ఏ క్షణంలో వేను వస్తుందో, గణేష్ శవం ఎప్పుడూ చూస్తామో అన్న ఆతృతతో ఉన్నారు. ఇప్పటికే గణేష్ చనిపోయి 24 గంటలు దాటుతోంది.

ఇంక వాళ్ళకు ఎదురు చూసే ఓపిక కూడా నశించిపోతోంది అన్న సమయంలో దూరాన సన్నగా శబ్దం క్షణక్షణానికి విస్తృతమవుతూ రోదనగా. రణగొణధ్వనిగా, నల్లటి మేఘాలలో విద్యుత్ ఘర్షణా పాతాల మధ్య ఏర్పడిన భీకర శబ్దాల్లా డప్పుల

మోతలతో, సముద్రంలో ఓడ తెరచాపతో మొదలయి దగ్గరవుతున్న కొద్దీ మెల్లమెల్లగా మొత్తం ఓడ దర్శనమైనట్లు శబ్దాన్ని వెన్నంటి వస్తోన్న కార్లు, లారీలు, దిగిపోతోన్న సూర్యునికి అడ్డంగా ఆక్రమించుకుంటోన్న ఎర్రటి దుమ్ముకణాలను చీల్చుకుంటూ ముందుకు వస్తోంటే ప్రతి అడుగు దూరానికి ఓంకార శబ్దాన్నుండి మాటలు పుట్టుకొచ్చినట్టు 'గణేష్ అమర్ రహే. గణేష్ అమర్ రహే' అన్న ఏక వాక్య రూపాన్ని సంతరించుకుని కర్ణఘోష చేస్తోంది.

ఊరి జనం పటేల్ నర్సిరెడ్డితో కలిసి ఎదురు వెళితే నదీ ప్రవాహం సముద్రంలో కలిసినట్లు అయింది. సముద్రపు పోటుకు నది ప్రవాహం ఆగి వెనకకు తిరిగి గట్లను తాకినట్లుగా మొత్తం గ్రామం జనమయమైపోయింది.

జన ఘోష కళాకారులు శవయాత్ర ముందు రెండు మూడు బృందాలుగా చైతన్యవంతమైన పాటలు పాడుతూ నాట్యాలు చేస్తున్నారు. ఆ పాటలకు నాట్యాలకు లయబద్ధంగా డప్పులు మోగుతున్నాయి.

"సూరీడు భగభగమండిండు.
ముద్ద మందారమైయిండు
ఎర్రకలువ రేకల వాలిండు
ఉడుకు రక్తమై ఉరకలేసిండు
గుండె వత్తిచేసిండు - నూనె బొంద నింపిండు
అగ్గి బూడిదగ ఆహుతైయిండు.
అవిగవిగో మంటలు. రుధిర జ్వాలలు
అన్నదమ్ముల కోసం - అక్కచెల్లెళ్ళ కోసం -
అమ్మ అయ్యల కోసం - అవ్వ తాతల కోసం -
పాలు తావే పసి పిల్లల కోసం -
తల్లి కడుపుల తన్నులాడే రేపొద్దు జీవాలకోసం -
ఆహుతైయిండు.
అందుకుందాం ఆ ధైర్యాన్ని - పంచుకుందాం రుధిరాన్ని
ఎల్లకాలం వాన్ని గుండెల్ల బతికిద్దాం.
'అమర్ రహే గణేషు' ఆయుధమై అడుగేద్దాం
పోరాటం సాగిద్దాం - పోరాటం సాగిద్దాం."

జనఘోష చుట్టూ జనం అల్లుకుపోయారు. డప్పుల మోతకు చేతులు జమయ్యాయి. 'అమర్ రహే గణేష్' మిన్నంటింది. అరుణబింబం ఇంతై, అంతై అంతంతై మేఘాలకు చిక్కటి నెత్తురు రంగు పులిమి, పల్లెను రక్తపు కాంతిలో ముంచింది. భయమేసిన కాకులు చెల్లా చెదురయ్యాయి. శ్వేత పక్షులు మాత్రం విజయంసాధించినట్లుగా ఆ అరుణ కాంతుల్లో తేలియాడాయి.

గణేష్ శవాన్ని ఉంచిన వేన్‌ను గల్లీలోకి మలుపు తిప్పారు. అంత దూరంలో ఉండగానే యాదగిరి, ఎంకటమ్మ తలలు కొట్టుకున్నారు. జనఘోషలో వాళ్ళ ఏడుపులు నిశ్శబ్దరాగాలయ్యాయి.

ఇంటిముందు కంబళి పరిచి చాప చుట్టను దించారు. శవం బయిటకు కనబడటంలేదు. ఎంకటమ్మ తల దిక్కున చాపను విప్పబోయింది.

"వద్దమ్మా వద్దు అట్లిప్పమాకు. ఆ మొగాన్ని నువ్వు చూడలేవు తల్లీ. నీ బిడ్డ ఉంగరాల జుత్తు కాలి బూడిదైనాది. మొహం గుర్తుపట్టలేనంతగా ఎర్రగా కాలి ముద్దయినాది. ఇప్పొద్దు తల్లీ."

ఎవరి వారింపులు లెక్కచెయ్యలేదు ఎంకటమ్మ. కట్టు విప్పి చాప పక్కకు జరిపింది. అందరూ ఎగబడి ముందుకు చూసారు. ఎర్రటి ముద్ద ఉంది అక్కడ. బయంతో వెనక్కు జరిగారు. ఎంకటమ్మ మాత్రం ఆ ముద్దను కాలితొడపైకి జరుపుకుంది.

"ఏదిర నాయినా నీ చెంపమీన పుట్టుమచ్చ? అది దిష్టి చుక్కై నీకు ఆపదలు రావనుకుంటన్నా. మంటల్లో మాయం జేసినావా తండ్రీ? చిటుకు చిటుకు రెప్పలార్పి నన్ను సంతోష పెడ్తివి గదరా తండ్రీ. గుడ్లురికి గట్లనే చూస్తోండవు, రెప్పల్ని మాడ్చేసినవుతా? గిట్లయితే నీ మీన బెమ తొలిగిపోద్దనువుకుంటివిర తండ్రీ" నెత్తుటి ముద్దను చూసి విలవిల్లాడింది తల్లి.

యాదగిరి మౌనంగానే చాప చుట్టకేసి చూస్తూ ఉండిపోయాడు.

క్షణాల్లో తల దగ్గర దీపం ప్రమిద పెట్టారు, ఊదిబత్తీలు ముట్టించారు, చెట్టుకింద ఎండుకట్టెలు మంటబెట్టారు. షావుకారు నల్లయ్య సామాన్లు చెబుతూ పంతులుతో లిస్టు రాయించాడు.

"నాకడున్నయి ఇస్తా పంతులు. అలంకరణ సామాగ్రి, బుక్కగులాలు, సుతిలీ, పన్నీరు షాపులో ఉన్నాయి. బంగారం, పగడాలు, ముత్యాలు పటేల్ సాబిస్తడు. దండలైతే వేన్ల మస్తుగున్నయి. పక్కూరికి బోయి పాడె బొంగులు, కుండ తేవాల్న. శవాన్ని దింపిన వేనును తోలుకుబోయి తీసుకురండి. పటేల్ పైసలిస్తనన్నడు. ఎవరు బోతరు?"

జనాల మధ్యనుండి కాలేజీ పిల్లలు బయటికొచ్చారు. వాళ్ళలో మహేష్‌రెడ్డి, సురేష్, రంగప్ప కనిపించారు. జనఘోష హడావిడిలో తన కొడుకు సురేష్ గురించి జ్ఞాపకం రాలేదు నల్లయ్యకు. సురేష్ ఎదురుపడగానే వళ్ళు జలదరించింది. "ఏందిరా నువ్వొచ్చినావా?" అన్నాడు తెప్పరిల్లి.

"ఔ బాపు వచ్చిన. నిన్న రెడ్డి వాళ్ళ డాడీకి ఫోన్ చేసినప్పుడు చెప్పలే. ఈ దినం మేం అందరం గణేష్ శవంతో వస్తమని చెప్పినాం కదా!"

"చెప్పినారులే. నిన్ననే రమ్మంటిని కదా? మీ యమ్మ ఎంత ఇదైనాదో తెలుసా. ఆరోగ్యం బాగోలేదామెకు. చెప్పిన మాట వినిపించుకోవేమిరా"

"ఎందుకు బయపడుతున్నారు అంకుల్. నిన్నటికి ఈ రోజుకి తేడా ఏంది. గణేష్‌ను అనాధలా వదిలిపెట్టి ఎలా రాగలం? వాడు చేసిన సాహసానికి అన్ని కాలేజీల జనాలు, గొప్పోళ్ళు, మేధావులు అందరూ జేజేలు కొడుతోంటే మేం చాతగానోళ్ళలా ఎట్లొస్తాం? మన గావ్ ఇజ్జత్ నిలబెట్టిన సాహస వీరుడు గణేష్, చరిత్ర పటంలో చిరస్థాయిగా ఉండిపోతాడు. వాని దోస్తులం, రూం మేట్లం, ఒక్క ఊరిపోల్లం మేం నెత్తురు చల్లారిపోయినోళ్ళలా, ఊపిరి లేనోళ్ళలా ఎట్లుంటాం? నిన్న గణేష్ బాడితో పెద్ద జులూస్ లేపినం. కలెక్టరు కాళ్ళ దగ్గర కొచ్చిండు. హోం మినిష్టర్ మా ముంగాల్ చేతులు కట్టుకుని క్షమాపణ కోరిండు. మా డిమాండ్లన్నింటిని తీరుస్తున్నడు. కాలేజీ సెంటర్లో గణేష్ విగ్రహం పెట్టాల్న అని పట్టుపట్టినం. మినిష్టుజిల్లా కలెక్టరుకు పని అప్పజెప్పిండు. చూడంకుల్ ఆ జనాల్ని చూడు. మన గావ్ కు ఎంతమంది తరలొచ్చిమో చూడు. నెత్తురుడికించే ఆ పాటల్ని చూడు. ఒళ్ళు జలదరించే డప్పుల మోత చూడు. ఈ చదువులెందుకు అంకుల్, పనికిమాలిన చదువులు. నెల దినాల్నుండి దేశ సేవలో తరించిపోయాం. చరిత్రలో గాంధీ, బోసు, భగత్ సింగ్ లాంటోళ్ళు సాహసాలు చదువుకున్నం. ఇపుడు మేం అంతటోళ్ళలా పోరాప ధైర్యం తెచ్చుకున్నాం. ఈ దేశానికి ఏం ఉన్నా లేకపోయినా మా యువత ఉంది. దేశానికి మేవే ఊపిరి, మేవే ప్రాణం." ఛాతి బిగబెట్టి చెప్పాడు రంగప్ప.

పంతులు రహస్యంగా నలయ్య చెవిలో అన్నాడు, "స్టూడెంట్లు కాకమీదున్నారు. ఇప్పుడేం మాట్లాడమాక. వాని దోస్తులు గదా. వెంట ఉంటరు. ఈ ఊర్ల జనం మీరంత రేతినుండి జాగరణ చెయ్యలేదా? మనోళ్ళన్న మాటొచ్చాక గట్లనే ఉంటది."

"పంతులుగారు ఇప్పుడు ఏం చెయ్యాల్నా?" అన్నాడు మహేష్ రెడ్డి.

పంతులు లిస్టు చేతిలో పెట్టాడు. "వేను తీసుకుపోయి బొంగులు తెప్పించండి. ఆపైన సామాను మీ ఇష్టం. అలంకరణ సామాగ్రి తెచ్చుకొండ్రి. చప్పుళ్ళయితే మీ తాన ఉన్న డప్పులు చాలు. మా రాజులాగావ్‌కు గణేష్ బాడిని తెచ్చిను. గట్లనే కాటికి సాగనంపండి. నాయినారెడ్డి ముంగల పటేల్‌కు కనవడిపో. అంతకన్నా చెప్పేదేంది లేదు. రేపు పొద్దుగాల మనందరం స్కూల్ దగ్గర కూర్చుని మాట్లాడుకుందాం."

"సారీ పంతులుగారు, రాత్రికి మేం సిటీపోవాల. మా అసోసియేషన్ మీటింగుంది. మన గణేష్ బలిదానానికి మొత్తం రాష్ట్రం మూడు దినాలు బందు ప్రకటించినం. అన్ని పార్టీలవాళ్ళు సహకరిస్తమని మాటిచ్చినారు. మా డిమాండ్లు మాటల్తో మాత్రమే అంగీకరించారు. వాటిని కాగితం మీద పెట్టించి సంతకాలు చేయించాల్న. జీ.ఓ. వచ్చేలా చెయ్యాల్న. చెప్పడం మరచినా. నేనిప్పుడు సిటీ కాలేజీల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంటుని. నెను ఈ దినం రావడమే కష్టమయింది. రాత్రికి ఎట్లనయినా పోవాల" అన్నాడు మహేందర్ రెడ్డి.

"నువ్వేం జేస్తవు రంగప్పా? ఉంటవా? వాని కూడా వోతవా?"

"లేదు పంతులుగారూ. నేను కమిటీల మెంబర్ని. గణేష్ కూడా మెంబరే. వాడు ఉద్యమాన్ని పెద్ద మలుపు తిప్పినాడు. మేం ఎవరం ఊహించలే, వాడట్ల చేస్తడని. వాని కుటుంబానికి ప్రభుత్వం పది లక్షలివ్వాలని డిమాండు చేస్తున్నాం. వాని కుటుంబానికి మేం చేసే సాయమది సారు. దాన్ని సాధించాల్న."

"రేపటి ముచ్చటలు ఇప్పుడెందుకులే గానీ జల్దీ పని కానీయండి. పటేల్తోచెప్పిమాత్రం పొండి. అయిన మస్తు బిజీ అయిండు. ఈ కార్యక్రమం అంతా ఆయన మీదనే ఉన్నది .ఏ పని ఎట్ల జరుగుతోంది ఆయనకు తెలియల్న. పోలీసోండ్లు కూడా మీ నాయన వెంట తిరుగుతుండ్రు."

"వస్తాం సారు" అంటూ ముగ్గురూ కదిలారు. వాళ్ళు పదడుగులు వెయ్యగానే రాజయ్య పంతులుకు గుర్తుకొచ్చింది రంగప్ప తల్లికి పక్షవాతం వచ్చిన సంగతి చెప్పలేదని. "రంగప్పా!" అనిపిలిచాడు. రంగప్ప వెనక్కు తిరిగేంతలో మనసు మార్చుకుని " పోయిరండ్రి. కార్యక్రమాలు జల్దీ ముగించాల. శవం ఉన్నకొద్దీ ఇంట్లవాళ్ళ బాధ పెరుగుద్ది" అన్నాడు.

నర్సిరెడ్డి అన్నం వండించి మంచి చేసాడు. గ్రామంలో వాళ్ళు తినగా మిగిలింది పోలీసులు, పై ఊరినుండి వచ్చిన వాళ్ళు మొత్తం ఖాళీ చేసారు. బందోబస్తుగా పోలీసులు ఇటు అటు తిరుగుతున్నారు గానీ వాళ్ళ అవసరం ఏం లేకుండా పోయింది. వాళ్ళు అన్యాయంగా ఎవరిమీదా చెయ్యి చేసుకోలేదు. స్టూడెంట్లు కూడా వాళ్ళ జోలికి పోవడం లేదు. ఇది వాళ్ళ కమిటీ ప్రెసిడెంటు ఊరని అల్లరి చెయ్యకుండా ఉన్నారు.

మహేంద్ర రెడ్డి సామాన్లు తీసుకు వచ్చాడు. వెదురు బొంగులతో పాడె కడుతూ ఉంటే యాదగిరి, ఎంకటమ్మ బంధువుల ఏడుపు మిన్నంటింది. తాటాకు చుట్టను విప్పకుండానే నీళ్ళు పోసి పాడెమీదకు ఎక్కించారు. బుక్క గుల్లాలు చల్లారు. సెంటు బాటిల్ మొత్తంగా పాడెమీద ఒంపేసారు.

"ఊర్ల సావుకు మా సప్పుళ్ళు లేకుండ ఎట్ల చేస్తరు?" అని గొడవకొచ్చిన దండోడాయన మూడు డప్పులతో గ్రామ చావిడి దగ్గర మోత మోగిస్తే పటేలు నాలుగొందలు చేతిలో పెట్టి, కల్లు సారాలకు వేరుగా పైసలిచ్చాడు. వాళ్ళు కల్లు దుకాణంకు పోయి పది నిమిషాల్లో తిరిగొచ్చారు.

శంకరయ్య "అందరూ దండలు, పూలేసి మొక్కండ్రి" అని అరిచాడు. శవానికి దండలు పడ్డాయి. స్టూడెంట్లు, ఊరి జనాలు పాడె చుట్టూ తిరిగి చివరిసారి మొక్కారు.

పాడె గణేష్ స్నేహితులు సాయంతో పైకి లేచింది. "గణేష్ అమర్ రహే" నినాదం ఊరంతా మారుమ్రోగింది. ఎంకాయమ్మ పాడెతో అడుగేసింది. ఆమెను గట్టిగా పట్టుకున్నాడు యాదగిరి.

చప్పుళ్ళు 'ఢఢం.. ఢంఢం...ఢఢం..ఢఢం" అని శోకలయతో మోగుతుంటే శవయాత్ర పారంభం అయింది. దనికన్నా ముందుగా వద గజాల దూరంలో జన ఘోష నృత్యాలు పాటతో కలిసి సాగుతున్నాయి. ప్రభుత్వాన్ని దుయ్యబడుతూ మైకులు నింపుకున్న వేన్ ఒకటి గ్రామ చావిడి సెంటర్లో తిష్టవేసింది.

యాదగిరి కుటుంబంతో బాటు పిల్లలు, పెద్దలు, ఊరి జనం పాడెతో బాటు శ్మశాన వాటిక వైపు అడుగులు వేసింది. అడుగడుగు నినాదాలతో, చప్పుళ్ళతో, బుక్కాగుల్లాలు, పూలరేకులూ, చిల్లర పైసలూ ఎగరేసుకుంటూ, పాటలు పాడుకుంటూ, పదవిన్యాసాలు చేస్తూ, ఊగుతూ, తూగుతూ, జన సందోహంతో బాటు 'గణేష్ ఏగుచున్నాడు అమర పురికి' అన్నట్లుగా సాగింది శవయాత్ర.

గంటలో చేరింది శవం స్మశానానికి. అప్పటికే గొయ్యి తీసి ఉంచాడు కాటికాపరి. పది నిమిషాల్లో పాడె మీంచి గోతిలోకి చేరింది శవం. ఏడ్పులు మరోసారి వినిపించినయి. పెద్దవాళ్ళు గట్టిగా చెప్పారు. "ఇగ ఎవులూ ఏడవకండి. వాన్ని మనం సంతోషంగ పంపాల్న. మనం ఏడిస్తే వాని ఆత్మశాంతించదు. శవం మీద పూలు, పైసల్ వెయ్యండి."

ముందు యాదగిరి, వెనుక ఎంకటమ్మ, ఆ తరువాత బంధువులు, పెద్దలు అంత బొందపైకి పైసలు విసిరి దండం పెట్టుకున్నారు. పిడికెడు మట్టి వేసి వెనక్కు తిరిగారు. "గణేష్ అమర్ రహే." నినాదం మరోసారి మోగింది. కాటికాపరి ఐదు నిముషాల్లో గోతిలో మట్టి నింపి ఆ పైన రెండడుగుల ఎత్తు దిబ్బ చేసి పెట్టాడు. దిబ్బమీద బుక్క గుల్లాలు చల్లి, పూలు వేసి, ఊదు బత్తీలు ముట్టించి దండాలు పెట్టుకున్నారు. పట్నం నుండి వచ్చిన వేనులు స్మశానం నుంచే వెనుదిరిగాయి. మూగబోయిన మనుషుల్లా ఊరి జనం నేలచూపులు చూసుకుంటూ ఇంటిమొహం పట్టారు.

గ్రామచావిడి దగ్గరకు వచ్చాక నర్సిరెడ్డి ఆగి సావిడి అరుగు మీద కూర్చున్నాడు. మిగిలిన పెద్దలు కూడా అక్కడ ఆగారు. ఆడవాళ్ళు ఇళ్ళకు బోయారు. మిగిలిన మనుషులు టెంట్లు విప్పి నేలమీద చుట్టుకుంటున్నారు, ప్లాస్టిక్ కుర్చీలను ప్రభల్లా వేనులో నిలబెట్టారు.

ఊరి జనం ఇళ్ళలోకి సర్దుకునేటప్పటికి రాత్రి ఎనిమిదయింది. నర్సిరెడ్డి అప్పటి వరకూ అందర్నీ సాగనంపుతూ గ్రామచావిడి దగ్గరే కూర్చున్నాడు. ముఖ్యమైన వాళ్ళు నలుగురైదుగురు నర్సిరెడ్డితో మిగిలారు.

"ఏం గొడవల్లేకుండా ఊరు పరువు నిలబెట్టినాం. అంతా మంచిగ జరిపించినా. మొదట స్టూడెంటు పిల్లలు వస్తన్నరంటే చాలా బయపదినా. మ పిల్లగాడు లీడరైనందుకు వాళ్ళు శాంతంగనే ఉండిరి" అన్నాడు నర్సిరెడ్డి చుట్ట ముట్టించి.

నల్లయ్య జ్ఞాపకం చేసాడు, "ఇక్కడికయితే బానె జరిపినాం. నిన్నరత్రి బండిల సిద్దప్ప భార్యని పట్నం పంపించినాం. ఇప్పుడేం చెయ్యాల్న? వాళ్ళ బాధలకు వాళ్ళను వదిలెయ్యడం మన ఊరి పద్ధతి కాదుగదా పటేలు!"

నర్సిరెడ్డి ఆ సంగతి మెదడులోకి రాగానే ఉలిక్కి పడి చుట్ట దూరంగా విసిరేసాడు. "చూస్తుండావు కదా, రేతినుండి ఒక్క లెక్కన గణేష్ బొందల కామ్ మీదనే ఉండినా. యాది చేసి మంచిపనిచేసినావు నల్లయ్యా. నువ్వు పొద్దుగేల పట్నం పోయెస్తనంటివి? ఆమె తానకు పోలేదా?"

"పోయినా,"

"గెట్లున్నది?"

"గట్లనే ఉన్నది. సరస్వతమ్మ వెర్రి చూపులు చూస్తున్నది. సిద్దప్ప మతి తప్పి ఆమె పక్కనె కూలబడ్డడు. పాపం వాని బిడ్డ ముత్యాలు బిక్కు బిక్కు మంటూ చూస్తా ఉన్నది. అమ్మ చూస్తే ఆ లెక్కన మంచం మీద పిచ్చిదాన్ల కదలకుండ పడున్నది, అయ్య మంచం పక్క మాటలేకుండా కూర్చున్నడు. బిడ్డకైతే ఏం సమజవతుల్లే. నన్ను చూడంగనే ఎక్కిళ్ళు పట్టినాది. నా మనసు గిలగిల కొట్టుకున్నది పటేలు."

"డాక్టరేమంటుండు?"

"ఎక్కడ డాక్టరు? నిన్న దవాఖానకు వోయినప్పుడు ఉన్నంట. నీ పేరు చెపితే, మంచమిచ్చినట. నర్సమ్మను నీళ్ళబాటిఎక్కించమని చిట్టి రాసిచ్చెనట. గంతే. ఆస్పటాల్లగా మినట్లనే బందు సురూ ఐనదట."

"వాళ్ళకేమయింది?"

"వాల్లకేం గాలా. అక్కడకూడా మన గణేష్ గొడవే. దవాఖానా చుట్టూ వేలకొద్ది జనం, టీవీలోళ్ళు, పేపర్లోళ్ళు, పోలీసులు. గా మినిట్లోనే పోస్ట్ మార్టం గావల్నని లొల్లి పెట్టిను. పెద్ద డాక్టర్ను కొట్టినట. గంతే, దవాఖాన మొత్తంకి మనింట్లోనే బందు సురూ చెస్సిను. డాక్టర్లు చిట్టీలు రాసిచ్చుడు లేదు. నర్సులు పేషంట్ల తానకు పోయేటిది లేదు. కలెక్టరు, హెల్తుమినిష్టరు వచ్చిను. నేను అంత గొడవలో వాళ్ళతానకు పోవడానికే పరిషానయిన. అంతలో మన శంకరయ్య అగుపడినాడు. 'ఏంది శంకరయ్యా గెట్లపోయెది?' అంటే ఆయన ఎనక తొవ్వ చూపినాడు. సిద్దప్పతో రెండు ముచ్చట్లు మాట్లాడి, కాస్త ధైర్నమిస్తి. 'గీ ముసలాయిన్ను నీ కూడా తోలుకుపో, వానికేమైనా అగుతే నాకు కష్టంగదాని' రంగప్ప చెబితే వాన్ని వెంబడి పెట్టుకుని గిట్ల వాపసొస్తిని. కొంతసేపు మన మాట వినే ముచ్చటే లేదు."

నర్సిరెడ్డి జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి తల గోక్కున్నాడు. "గేందిది? మన గావ్‌కు ఏందో పీడ పట్టినట్లవుతాందే మన పిల్లలు వచ్చినంటే వచ్చిను, మాయవయ్యిను. వాండ్లతో మంచి చెడు ముచ్చటించడానికి కూడా టైం లేకపోయె. వాళ్ళు ముగ్గురూ వేన్లమీద పోయిండ్రా?"

"ఏమో పటేలు తెల్వ. వాన్లయితే పిల్లల్ని నింపుకుని వోయినాయి." అన్నాడు పంచాయితీ నౌకరు లచ్చమయ్య.

"మనోళ్ళుంటే ఈడనె ఉండాలి గదా!" అన్నాడు రాజయ్య పంతులు చుట్టూ కలయ చూసి.

"గిప్పుడేం చెయ్యాల్నా?" తల పట్టుకున్నాడు నర్సిరెడ్డి.

●●●

**నల్లయ్య తనకు తోచిన సలహా ఇచ్చాడు** "ముందు డాక్టరుకు ఫోను కొట్టు పటేలు, గవర్నమెంటు దవాఖాన కాకపోతే మరొక చోటకు పంపిద్దాం. గట్లనే మీ వాన్కి కూడా చెప్పుగా రంగప్పను ఏక్ దమ్ దవాఖానకు పొమ్మని."

నర్సిరెడ్డి అతని సలహా పాటించి ముందుగా డాక్టరుకు ఫోను చేసాడు. డాక్టరు లైనులోకి రాగానే "ఏం డాక్టరు సారు బాగున్రా! నేను పటేల్ నర్సిరెడ్డిని" అన్నాడు.

డాక్టరు పటేల్‌ను గుర్తించాడు. "ఏం బాగుండటం పటేలు, మీ ఊరాయన సవ్వడం కాదుగాని మా ప్రాణాల మీదకొచ్చింది. ఎంత స్టూడెంట్లయితే మాత్రం హాస్పటల్ ఫర్నీచరు ధ్వంసం చేసి సూపర్నెంటు మీద చెయ్యి చేసుకుంటారా? ఆయన చేతుల్లో ఉన్నదా క్షణాల మీద పోస్టుమార్టమ్ రిపోర్టిచ్చెయ్యడానికి? అది మామూలు చావా! ఉద్యమంలో పెట్రోల్ పోసుకుని అంటించుకున్నాడు. అంతకు ముందే విషం తాగాడో, బాడీ మీద కత్తిపోట్లున్నయో, వేరేవాళ్ళు సంపినా అంతా చూసి రిపోర్టు రాయాలి. మెజిస్ట్రేట్ రావాల్న, కరణం రావాల్న, వాళ్ల బంధువులు రావాల్న.'ఇదేం చిన్నపిల్లల ఆట కాదు కదా పటేల్!? స్టూడెంట్లలో మీ వాడు కూడా ఉన్నడంట కదా? టీవీ వాళ్లు వీడియో తీసినిన్నటి నుండి వేస్తోనే ఉంటిరి. మా వాళ్లు స్ట్రైకులోకి పోక ఏం చేస్తారు. హాస్పటల్ దగ్గర అల్లరి చేసిన వాళ్లను అరెస్టు చేసేవరకూ డాక్టర్లు ఎవరూ పనిలోకి పోయేట్లు లేదు."

"నిన్న సరస్వతమ్మని ఒక పేషెంటుని పంపినం. ఆమె ఎట్లున్నది తెల్వక ఫోన్ చేసినా. మంచిగా ఉందా సారు?"

"సారీ పటేలు, నువ్వు చెప్పినావని జాయిన్ చేయించాను. ఆమెకు వాతం కమ్మి కాలు, చెయ్యి పడిపోయింది. బి.పి.కూడా ఉంది. ఇంకా కాంప్లికేషన్స్ ఏమున్నాయో చెక్ చెద్దామంటే ఈలోగా స్ట్రైక్ వచ్చి పడింది. మేం ఎవరం హాస్పటల్ లోపలికి పోవడం లేదు. మా యూనియన్ గేటు దగ్గర టెంటు వేసారు"

"వేరే తానకు మార్చమంటరా?"

"మారిస్తే మంచిదే ప్రైవేటు హాస్పటలుకు తీసుకు వెళ్లండి. ఈ స్ట్రైకు ఇప్పట్లో తేలేలా లేదు."

"మంచిది సారు." అని ఫోన్ పెట్టేసాడు నర్సిరెడ్డి. "అదండి డాక్టరు చెప్పేది. ప్రైవేటు ఆసుపత్రికి తోలుకు పొమ్మంటుండు. మరి సిద్దప్ప పరిస్థితి ఏందో? పైసలు వాని తాన వున్నవో లేదో మనం కొంతమందిమి పోయొస్తమా?"

"సిద్దప్ప కొడుక్కి ఒక దఫా చెప్పినంక సోచాయిద్దాం. వాని దిమాగ్‌ల ఎమాలోచనున్నదో. వాని కుటుంబం ఆలోచన్లను వట్టి మనం చేసేటిది చెయ్యాల." అన్నాడు నల్లయ్య.

నర్సిరెడ్డి ఈ సారి తన కొడుకు మహేందర్ రెడ్డికి ఫోన్ చేసాడు. కొడుకు లైన్లోకి రాగానే అడిగాడు "నాయనా నువ్వట్లనే వెళ్లిపోతివి?"

"ఔ బాపు. మేం ఇక్కడ చాలా పరిషాన్ల ఉన్నం. గణేష్ మరనంతో మా ఉద్యమం ఖతమౌద్దనుకున్నం గాని గవర్నమెంటు మాట మార్చేట్లున్నది. పేపర్లమీద పెట్టమంటే ఆప్సర్ల తానకు పొమ్మంట్రను మినిష్టర్లు. ఊర్ల కర్ఫ్యూఫ్యూ పెట్టిన్రు. మా స్టూడెంట్లందరం ఒక్క మాటమీదుంటిమి. వచ్చుడో, సచ్చుడో అమీతుమీ తెల్చుకుందమంట్రును."

నర్సిరెడ్డి కంగారు పడ్డాడు. ఈ ఉద్యమం తీవ్రరూపం దాలిస్తే ఇంకెంతమంది చనిపోతారో. "నాయినా జాగ్రత్త. పెద్ద డిమాండ్లు ఎత్తుకున్రు. క్షణాల్లో తేలిపోయేటివి కావు. మీ ప్రాణాలు ముఖ్యం."

"మేం ఎప్పటి నుండో పోరాడుతున్నాం. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పుడు మేం ఒక్కటే లక్ష్యం వెట్టుకున్నం. మాకు సంవత్సరం చదువుపోయినా సరే గిట్లనే పట్టుమీదుంటాం."

"నాయినా మీ స్టూడెండ్లలో బీదబిక్కీ ఉంటరు, చదువు మీదే ఆధారపడినోళ్ళుంటరు. వాళ్లకు అన్యాయమౌతాదేమో ఆలోచించినావా"

"లేదు బాపు, నాన్ను బయపెట్టమాకు. మా స్టూడెంట్లందరు మంచి ఉషారుగున్నారు. వాళ్ల ఇష్టంలేందే నేనేం చెయ్యగలను? ఎవుడైన డిమాండ్ల కడ్డొస్తే చమడాలొలిచేస్తామంటున్నారు. ఏం లేనోడు మన గణేషె ప్రాణాలు బలిదానం చేసుకున్నడంటే ఉద్యమం ఏ లెక్కనున్నదో చూడు. లీడర్నయ్యుండి గమ్మునెట్లుంటను!"

నర్సిరెడ్డికి ఏం సమాధానమివ్వాలో తోచలేదు. నల్లయ్య మరోసారి జ్ఞాపకం చేసాడు సిద్దప్ప సంగతి. "గదట్లుంచు. మీతో చాలా సంగతులు మాట్లాడాలనుకుంటిమి. మన గావ్‌ల పెద్ద చదువులు చదువుకునే పిల్లగాండ్లు మీరు నల్గురు. ఒక్కడు ప్రాణాలు తీస్కుండు. మేం ఎన్నెన్నో కలలు కని మిమ్మల్ని కాలేజీలకు పంపినం నాయినా. గిప్పుడు సోచయిస్తే గుబులౌతోంది. మీ ముగ్గురేమౌతారా అని మేం పరిషనౌతున్నాం. నీ తాన సిద్దప్ప కొడుకు రంగప్ప ఉండినా?"

"లేడు. పక్క రూమ్ల ఉంటడు. ఈ దిన హాస్టలు ఖాళీ చేయిస్తమంట్రును. మేం రూమ్లు వదలమని బైఠాయించినం ఏం బాపు, వాన్ని పిలుచుకు రావాల్నా?"

"నువ్వు సంగతి చెప్పు చాలు. నిన్న సురేష్ వాళ్ల నయన చెప్పబోతే గరమయిండట. ఆయన గమ్మునున్నడు."

"ఏంది సంగతి?"

"వాన్ని కంగారు పెట్టక చెప్పు. రంగప్ప వాళ్లమ్మకు వాతం కమ్మి కాలు చెయ్యపడిపోయినయి. బండి కట్టి గవర్నమెంటు దవాఖానకు పంపినాం. అక్కడ వాండ్లు కూడా స్ట్రైకు చేస్తున్నరట. డాక్టర్లు లేరు, మందుల్లేవు. ఏ మినిట్ల ఏమవుద్దో తెల్వదు. ఆమె తాన నాయన, చెల్లెలు ఉండ్రని చెప్పు. జరూర్ చెప్పు నాయినా. వాని హాస్పటల్కు తోలుకుపో."

"ఇప్పుడు మేం ఎవరం బయటకు పోయే లెక్కన లేదు. బందోబస్తు పెట్టిన్రు. కనిపిస్తే కాల్చివేత అంటున్రు. ఏం చెయ్యను?"

"ఏం జేస్తవో నాకు తెల్వదు బిడ్డా. వాన్ని తీసుకుపోయే జిమ్మేదారి నీది. ఇది వాని కుటుంబ సమస్య. దునియా గురించి ఆలోచనల్ల పక్కన పెట్టి వాన్ని ఎట్లయిన తీస్కపో. వాని నాయన హాస్పటల్ల దిక్కులేనివానిలా పడున్నాడు. ప్రైవేటు హాస్పటల్కి తోలుకు పొమ్మని డాక్టరు చెప్తావున్నాడు. నాకు ఏం జరిగింది కబురు చెప్పాల్నా. నీ కబురు అందినాక మేం వస్తాం. ఇప్పుడే పొండి" ఫోను పెట్టేసాడు నర్సిరెడ్డి.

"చూద్దాం. ఒక గంట రెండు గంటలు చూసినంకా మా వాన్నుంచి ఫోన్ రాకపోతే నేనే ఫోన్ కొడతా. నడిమిట్ల మనం చేసేదేం ఉంది? ఇండ్లకు పొండ్రి. ఓయ్ శంకరయ్యోయ్ జర యాదగిరిని చూస్కో మీ గల్లీపోళ్లను మీరే జూస్కోవాల. ఏదైన జరూర్ అవసరం పడితే నా తానకు రండ్రి" నర్సిరెడ్డి లేచాడు. జనాలు పటేల్కు దారిచ్చారు.

నర్సిరెడ్డి ఇంటికి పోయేసరికి ఆయన భార్య లక్ష్మి పనివాళ్ల చేత ఇల్లంతా శుభ్రంగా కడిగించి ముగ్గులు పెట్టించింది. తను స్నానం చేసి తలార బోసుకుంది. "వేన్నీళ్లు కాపించినా, తానం చేసిరా" అంది. నర్సిరెడ్డి ఇంటి వెనక్కి పోయి బాత్ రూములో బట్టలు విడిచి స్నానం చేసి వచ్చాడు. తెల్లలుంగీ కట్టుకుని వసారాలో పడక్కుర్చీలో వాలిపోయాడు. లక్ష్మి వేడి వేడి చాయ్ ఇచ్చింది. ఊరి మనుషులు ఎవరూ లేకపోవడంతో ఆమె నర్సిరెడ్డి పక్కన కుర్చీలో కూర్చుంది.

నర్సిరెడ్డి చాయ్ రెండు గుక్కలు తాగిన భార్యను అడిగాడు, "ఏం చేద్దమంటవు? మనవోడు కాలేజిల లీడరయిండు. వాన్ని వెనక్కు రమ్మనటం కష్టమే, అట్ల వదిల్నా కష్టమే. ఏం టైమ్ల ఏ కష్టమొచ్చి నెత్తిన పడద్దో తెల్వదు. నాయకత్వమంటే కత్తిమీద సాము లెక్కన అవుద్ది. నేను గామానికి నాయకత్వం జేస్తే వాడు రేపటి దినాన రాష్ట్రానికి నాయకుడౌతడని మనం మురిసినాం. అంత వరకు వాన్నుండనిస్తురా అని నాకు గుబులు పుట్టుకొస్తున్నది."

"వాన్ని చదువు మాని వచ్చెయ్యమని చెప్పు. మనకి మస్తు భూముంది కదా. ఎగుసం చేసుకుంటడు. నీ లెక్కన ఊరికి పటేలౌతాడు. "

"ఆ ఆలోచన వాన్ని కాలేజీ చదువుకు పంపకముందు వచ్చేటిది. ఇప్పుడు వాడు మన చేతుల్ల లేడు. నడిమిట్ల నేను లీడర్నికాను, మానేసి పోతనంటే నరుకుతరు. నీ లెక్కనే సొచాయించి ఎగుసంలో వెడ్తమనుకో, అదెట్లున్నది? వాన దేముని రాకట అదృష్టంపై ఉన్నది. ఒక ఫసల్ మురిపిస్తే మరొక ఫసల్ మననోట మన్ను కొడుద్ది. మన ఎగుసం భూములకు కాల్వలున్నవా? బోర్లున్నవా? దేవుని నమ్ముకుని భూమిని దున్నాలె. ఆ బాధలేవో నేను పడ్తున్నా. వానికెందుకని చదువుల బెడ్తిని. మంచిగ చదువుకుంటే ఉద్యోగం చేసుకుని అతుకుతడనుకొంటిని. లీడర్నంటే ఏ పుట్టల ఏ పాముందోనని ముచ్చట పడితిని. అది నిజం పాము లెక్కనే మారినది."

లక్ష్మి కళ్ల నీల్లు కార్చింది.

నర్సిరెడ్డి చాయ్ కప్పు ఆమె చేతిలో పెట్టాడు. "నువ్వు దైర్నంగుండాలి. గావ్ల వాండ్లు మనకన్న చిన్నోళ్లు. మనమిట్లయితే వాళ్లేమౌతారు. నిన్న రేతి సరస్వతమ్మను చూసినావు గదా, ఎంత గాబరా వెట్టిందో? ఈ పొద్దుకు ఆమె ఎట్లున్నదో? నీ ఆరోగ్యమట్లయితే నేనేం చేసేటిది" ఆయన కళ్లు కూడా చమర్చాయి.

ఏసుపాదం బండి వాపస్ తీసుకొచ్చాడు. వాడు గుమ్మం దగ్గరకు రాగనే అడిగాడు నర్సిరెడ్డి "ఏమయినాది. పొద్దుగాలెందుకు రాలా?"

"వద్దామనుకుంటిని దొరా. సిద్దప్ప ఒక్కనితో కష్టమని ఉండిపోయినా వాని పాప ముత్యాలు రేతి బండిపైనే నిద్రవోయింది. పొద్దుగాల చాయ్ బన్‌లు తెచ్చివెడ్తిని. మీరొస్తరని చూస్తిని. మూడు గంటలకు బండిని తోల్కపొమ్మని సిద్దప్ప చెప్పినాడు"

బండెడ్లు నోర్లు తెరిచి చొంగలు కారుస్తున్నాయి. "వాటికి మేతేసినావా?" అడిగాడు నర్సిరెడ్డి ఎడ్ల మొహాలు చూసి.

"రేతి బండిల సద్దిన గడ్డిమేసినాయి. నీల్లు తాపిద్దమంటే దొరకలా. ఊర్లకొస్తావుంటే నీల్ల గుంట దగ్గర తాపించినా."

"వార్నీ. అంతదాక పానాలు నిలుస్తయా! జల్దీ దొడ్లోకి తోలుకుపో. పచ్చి మేతేసి నీళ్లు తాపిచ్చు. ప్రొద్దుటే పొలానికని మళ్లీ తోలుకు పోమాకు. పోపో. ఆగు. నువ్వేమన్న తింటివా?"

"లేద్దొరా. దుకానంలు బందున్నయి."

"వాటినట్లొదిలి ముందు రెండు ముద్దలు తినిపో. లక్ష్మీ వీన్ని జూడు" లక్ష్మి ఇంట్లోకి వెళితే పక్కదారిని పెరట్లోకి వచ్చాడు ఏసుపాదం.

లక్ష్మి ఆకు నిండ అన్నం పెట్టింది. ఏసుపాదం కాళ్లు చేతులు కడుక్కుని వచ్చి కూర్చున్నాడు.

"ఆమెట్లున్నది?" అన్నది ఎర్ర మిర్చి పచ్చడి వేస్తో.

"మంచాన కంటుకు పోయిందమ్మా. మాట పలుకు లేదు. పొద్దుట దవాఖానలోకి తీసుకువోయినా. అంతే వచ్చేటప్పుడు చూసినా. ఒక్కలెక్కనే ఉన్నది. పోలీసోండ్లు బండిని తియ్యమంటే దూరంగ స్టేషన్ తాన వెటి చిన్నిమ్మితో ఉంటి."

"గణేష్ పోయిన్నంటే ఆ సరస్వతమ్మ చాలా పరిషానైనది. తన కొడుకేం చేస్తడోనని గుబులు పట్టినాది."

"ఆ యమ్మి బొంద మాదిరి పడుంటే నకు గుండె మోకాల్ల కిందికి జారిందమ్మా. ఎట్ల బతికి బట్ట కట్టుద్దో? సిద్దప్ప ఏం మాట్లాడుతున్నడో, ఏం చేస్తోన్నాడో సమజ్ కాకుండింది. పంట కోసి వారం దినాలైనదట. ఆరుతుందని వదిలనట. కుప్పవెయ్యలేదు. దాన్నట్లనే వదిలి దవాఖానాలో బైటాయించినాడు. కట్టుకున్నామె మాట పలుకు లేకున్నది, పొలంలో పంట నేల పొర్లాడుతా ఉన్నది. నడిమిట్ల తనకొడుకేమౌతనోని దిగులు. దవాఖానలో డాక్టర్లు లేరు, మందుల్లేవు, తింటానికి, తావడానికి హోటేళ్లు బందు, ఆయన నసీబెట్లున్నదో దేవుని కెరుక" భారంగా ఒక్కొక్క ముద్ద నోట్లో పెట్టుకుంటూ చెప్పాడు.

లక్ష్మి సావిడి రాటకు జార్లబడి వింటూ కూర్చుంది. "అమ్మా ఒక్కమాట చెప్పేదా?"

"ఏందది?"

"మన బాబు దవాఖాన దగ్గర అల్లర్ల చూసినా."

"ఒక్కన్నే చూసినా."

"ఒక్కన్నే చూసినావా?"

"వాండ్లు కూడా ఉంటిరి, రంగప్ప సురేషులు."

"రంగప్ప వాన్నాయన్ను, అమ్మను చూడలేదా?"

"ఏమోనమ్మా. నేను వాన్తానకు వోదమంటే పోలీసోండ్లు చుట్టుముట్టిరి. మినట్ల మాయమైనారు. వానికి తెల్వదంటరా"

"ఏమో ఇప్పుడైతే పటేలు ఫోను చేసి చెప్పిండు.

ఏసుపాదం అన్నం తిని ఆకు మడిచి పారేసి, గొడ్లను తీసుకుని షెడ్డు దగ్గరకు వెళ్లాడు. గుడిసె ముందు నిన్న రాత్రి తను వేసుకున్న మంచం అలానే ఉంది. దానిపై పాండ్రయ్య కూర్చుని పైకి గట్టిగా పుస్తకం చదువుకుంటున్నాడు "ఊయ్‌ల, ఉడ్త. ఎల్కి, ఏన్గు" అంటూ.

ఏసుపాదం చిరాగ్గా కేకేసాడు. "నీ యవ్వ సదువాపిట్లరా. గొడ్లకు మేతెయ్. గోలల్లో నీళ్లు వట్టినావా?"

"అమ్మ పట్టినంది."

"నువ్వేం జేస్తండావు? బుక్కు ముంగలేసుకుని కూర్చుండావా? నీకా పంతులొకడు దొరికిండు. రేపట్నించి ఆ ఇస్కూలు తానకు పోమాకు. గిత్రా. సంచిల్ల మేత తొట్లల్ల వెయ్."

పాండ్రయ్య పుస్తకం మడిచి వచ్చి మేత సంచులు తీసాడు. "పంతులు గిట్లనే చెప్పిండు. పుస్తకం ఇస్కూల్ల గిరాటేసి పొమ్మన్నాడు."

"నిన్ను గణేష్ లెక్కన చేస్నన్నడు నిన్నటి పొద్దువరకూ. వానికి సమజైనట్లున్నది."

"నేను చదువుకుంటూన్నాయినా. నాకు అక్షరాలు మంచిగనిపిస్తున్నయి."

"ముందు పనిచూడరా" మరోసారి కేకలేసాడు ఏసుపాదం.

పాండ్రయ్య మేతతో తొట్లు నింపసాగాడు. చీకటి పడింది. గుడిసెలో పొయ్యిమంట పైకి లేచి ఎర్రగా బోర్లించిన కుండ ఆకారాన్ని తేల్చింది గుమ్మాన్ని. మధ్యలో నల్లటి స్థూపాకారంలో మారెమ్మ కూర్చుని పొయ్యిమీద జొన్న రొట్టెలు తిరగేస్తోంది.

ఏసుపాదం మంచం మీద నడుం వాల్చాడు. రాత్రి నిద్రలేని కారణంగా వెంటనే నిద్రపట్టేసింది. మధ్యలో రొట్టెలు తినడానికి లేపింది మారెమ్మ. "వద్దెయ్. పటేలింట్ల వన్నం తింటిని." అన్నాడు కళ్లు తెరవకుండానే. ఎప్పుడు తెల్లారిందో తెలియదు. సూర్యుడు వాడి కిరణాలతో పొడుస్తుంటే మెలుకువ వచ్చింది.

కళ్లు తెరిచిన వెంటనే మారెమ్మను పిలిచి "పటేల్ పిలిచిండా?" అని అడిగాడు.

లేదని చెప్పింది మారెమ్మ. "పొలానికి ఎరువు తోల్కపొమ్మన్నాడు. ఈ దినం పోవాల్నోలేదో" అనుకుంటూ లేచి గానుగ పుల్ల విరచి పళ్లు తోముకున్నాడు. పాండ్రయ్య చీపురుకట్ట పడేసి ఒక్క పరుగులో వెళ్లి తిరిగొచ్చి చెప్పాడు. "దొర కుర్చీల కూర్చుండు. నిన్ను దోల్క రమ్మన్నాడు" అన్నాడు ఆయాసపడుతూ. ఏసుపాదం మొహం కడిగి తుండుతో తుడుచుకుంటూ అలాగే వెళ్లాడు సావిటి దగ్గరకు.

"దొరా పిల్సినవంట? పొలానికి ఎరువుల సంచిలు తోల్కుపోనా?"

"గట్లే తోల్కుపో. నే పట్నం పోతున్నా. గ సిద్దప్ప దవాఖాన తానే ఉన్నడా?"

"అవుదొరా."

"వాని పొలం దిక్కున చూసిరా ఎట్లున్నదో"

"కుప్పపెట్టాల్న. ఆయన లేకుండా నా ఒక్కనితో అయ్యేపనికాదు."

"నువ్వయితే పనోళ్లను మాట్లాడుంచు. సరస్వతమ్మను హాస్పటల్ మార్పించి ఆయన్ను పంపుతా ఆ కిరాణం నల్లయ్యను నేను పిల్చినానని చెప్పి తోల్కురా"

ఏసుపాదం నల్లయ్య ఇంటికి పోయాడు. నల్లయ్య దుకాణం మూసి ఉంది. ప్రొద్దుటే ఆరింటికి తీసే దుకాణం ఎనిమిదైనా తియ్యకపోతే ఆశ్చర్యం వేసింది ఏసుపాదానికి. తలుపు కొట్టి పిలిచాడు .

నల్లయ్య బయటికి వచ్చాడు. "పటేలు పిలుస్తుండు."

"నేనే వద్దామనుకున్నా. ఇంతల నువ్వొచ్చినావు. పద." అంటూ తలుపు దగ్గరకు వేసి తుండు గుడ్డ భుజాన వేసుకుని బయలుదేరాడు.

నల్లయ్య గుమ్మంలోకి అడుగుపెట్టగానే "చొక్కా వేసుకుని రా, పట్నం పోదాం." అన్నాడు కంగారుగా నర్సిరెడ్డి.

"మీ వోడు రాత్రి ఫోన్ చేసిండా?"

"లేదు. నేను రెండు సార్లు చేసినా అట్నించి జవాబు లేదు. లైన్లు పాడైనాయో ఏందో తెల్వకున్నది. మనం పోయి చూస్తేగానీ వాస్తవం తెల్వదు."

"నేను రాలేను పటేలు. ఇంట్ల ఆమెకు బీమారుగుంది."

"ఏమైనాది?"

"రాత్రి రెండు మూడు దఫాలు ఫిట్లు వచ్చినయి. రాజయ్య పంతుల్ని కబురెట్టినాను. వాని తాన మాత్రలేవో ఇచ్చినాడు."

"ఇప్పుడెట్లున్నది?"

"మగతగా పడుంది."

"మన పిల్లగాండ్ల కోసం అందరూ అట్లే పరేషానౌత్తున్రు. పోయి వాన్ని తోలుకొద్దం పద."

"ఇంట్ల ఎవరూ లేరనేగదా రానంటిని. దుకాణం గూడా బందు చేస్తి. నీకు పున్నెముంటది, కాల్మొక్కుతా వాన్ని నువ్వే తోల్కొరారాదు? నీ మాటైతే నడుస్తాది పటేలు"

"సరే, నేనొక్కన్నే వోతా. ఏదైనా జరూర్ పనుంటే నా సెల్లుకు ఫోన్ కొట్టండి" అన్నాడు నర్సిరెడ్డి చేసేదిలేక. ఇంట్లోకి వెళ్లి లక్ష్మితో చెప్పాడు. కొడుకుని ఎలాగైనా తీసుకురమ్మని మరీ మరీ చెప్పింది లక్ష్మి.

నల్లయ్య నమస్కారం పెట్టి ఇంటికి పోయాడు. నర్సిరెడ్డి చెప్పులు తొడుక్కుని వీధిలో అడుగు పెట్టాడు. ఏసుపాదం వెనుకనే బస్సు వరకూ సాగనంపడానికొచ్చాడు. గ్రామచావిడి దగ్గరకు బస్సు పదిగంటలకు బస్సు వస్తుంది. ఇంక గంట టైముంది. ఇంట్లో కాలు నిలవక ముందుగానే బయలుదేరాడు నర్సిరెడ్డి.

●●●

**బయిట అరుగు మీద కుర్చీ తెచ్చాడు ఏసుపాదం.** "గణేష్ ఇంటికి ఎవరైనా పోయి చూసిన్రారా?" అన్నాడు చుట్ట ముట్టిస్తూ.

"లేద్దొరా"

"ఇంక బస్సుకు టైముంది కదా, మనం పోయొస్తే పోలా?" అనుకుంటూ మళ్ళీ కుర్చీలోంచి పైకి లేచాడు.

ఏసుపాదం పటేల్ కన్నా ముందు వెళ్ళి యాదగిరి తలుపు బయటకు వచ్చి నిలబడి పటేల్ దగ్గరకు రాగనే "దండాలు దొర!" అన్నాడు చేతులు జోడించి.

"ఎట్లున్నరు?"

యాదగిరి మాట్లాడలేదు.

"బందుగులుండ్రా, పోయిన్రా?"

"---"

"ఏందిరా! మాట్లాడవు?"

"యాదగిరి, నీ బాదేంది? నీ బిడ్డడి కార్యక్రమం అంత మంచిగ జరిపినం."

"వాడు మారాజు లెక్కన బోయిండు. బొందలకాడికి వచ్చిన జనాన్ని చూస్తే వానిమీద ఎంత అబిమానముందో తెలుస్తా ఉంది. మహేందర్ రెడ్డి సర్కారుకు చెప్పి నీకు జరిగిన అన్నాయానికి పది లక్షలు ఇప్పిచ్చడానికి తిరుగుతుండు. నేబోయి ఆప్సర్లతో మాట్లాడతా. నీకేం ఫికర్లే."

యాదగిరి పటేల్ కాళ్ళమీద వాలిపోయాడు. "నీ బాంచన్ దొరా! నాకు నిన్నటి దినాన్నుంచి నోట మాట వస్తలేదు. కాలి ముద్దయిన గణేష్ శవాన్ని చూసినంక మాటవోయిఇంది. శవం వెంట వచ్చిన జనాన్ని చూసి, జనం పాట చూసి, డప్పుల దరువులు

చూసి, మైకుల హోరు చూసి ఏదెట్లాతోందో తెలీక మూగవోయినా. ఈ గావ్‌ల నేనే గణేష్ నాయన్నని నా కింత పేరు తెస్తడని అనుకోలేదు పటేలు. నా ఇంటికి కార్లొచ్చినయ్ మినిష్టర్లొచ్చిను, ప్రజాసేవకులొచ్చిను, డప్పులొచ్చినయి, మైకులొచ్చినయి. ఇన్ని నా ముంగల నిలవెటి రెండు గంటల తమాష జూపి వాడు వాని దార్నపోయినాడు. డప్పుల మోతలు ఆగినయి. కార్లు బుర్రు బుర్రు మంటు తిరిగి పోయినయి. బందుగులు పోయిను. పటేల్ సాబ్ నిన్నటి పొద్దు దాక జావనీళ్ళకోసం చూసిన. నా ఇల్లు ఇప్పుడు బియ్యం పప్పులతో కళకలలాడతాంది. నిన్నటి దాక తిండి లేక ఆకల్తో మలమలమాడినం. తోచినోళ్ళు తోచినంత తెచ్చి గుమ్మంల వెట్టినారు. ఇప్పుడు ఇంటినిండా వెచ్చాల్తో ఆకలి సచ్చిపోయింది. ఎంకటమ్మ రాత్రి అన్నిటిని మంచం కిందకు దోసి, మంచంపైన పండినది. తెల్లారి చూస్తే దాని వళ్ళు కుతకుతలాడిపోతోంది దొరా. ఇంట్ల నిప్పు రాజెయ్యకుండానే దాని వళ్ళు కాలిపోతోంది దొరా."

యాదగిరి దుస్థితికి నర్సిరెడ్డి బాధపడ్డాడు. "ఏం చేసేటిది యాదగిరీ. కష్టాలన్నీ ఏక్దం వచ్చినాయి. జర్ర ఓపిక పట్టాల. పంతులకు కబురెడతాను. వచ్చి మందిస్తాడు. పట్నం తీస్కవోయి దవాఖానాలో పెడ్దమంటే బందు నడుస్తున్నది. సర్కారు పైసలొస్తే మీ కష్టాలు తీర్నట్టే. ఆమెను దగ్గరుండి చూస్కో. మీరిద్దరు ఒకళ్ళకొకళ్ళు ఆధారమయ్యిను"

"బస్సొచ్చింది దొరా" అన్నాడు ఏసుపాదం. నర్సిరెడ్డి కండువా భుజాన సరిచేసుకుని లేచాడు.

బస్సు హారన్ వేసింది. ఏసుపాదం వడివడిగా అడుగులు వేస్తూ చెయ్యి ఎత్తిపెట్టి చూపాడు. వెనగ్గా వస్తోన్న నర్సిరెడ్డిని చూసి డ్రైవరు బస్సు ఆపాడు. నర్సిరెడ్డి వచ్చి ముందు సీటులో కూర్చున్నాడు. బస్సు అంతా ఖాళీగానే ఉంది. రెండు పల్లెలు దాటేలోగా నిండుకుంటుంది.

"ఏం సారు పొద్దుటే పోతుంటివి పట్నానికి? బస్సు ఊర్లకంట పోట్లే. చెక్ పోస్ట్ దగ్గర మలుపుత్తును" అన్నాడు కండక్టరు టిక్కట్టు ఇస్తూ.

"పోనీ. ఆడనే దిగుతా" అన్నాడు నర్సిరెడ్డి. బస్సు కదిలి రెండు గంటల తరువాత గమ్యం చేరింది. పట్నం నిర్మానుష్యంగా ఉంది. పోలీసులు మూసేసిన షాపుల దగ్గర, అవిసి చెట్ల కింద కాపలాగా కూర్చున్నారు. పట్నంలో కర్ఫ్యూ తొలిగించి 144 సెక్షన్ విధించారు. అవసరమున్న వాళ్ళు మాత్రమే రోడ్డు మీద తిరుగుతున్నారు. చెట్టుకింద నిద్రపోతూన్న రిక్షావాణ్ణి లేపాడు నర్సిరెడ్డి.

"ఏడకు బోవాల్న?" రిక్షా ఆయన సీటులోంచి లేవకుండానే అడిగాడు.

"గవర్నమెంటు దవాఖానాకు. వస్తవా?"

"తీస్ రూపయవుద్ది"

చుట్టూ చూసాడు. మరో రిక్షా లేదు. "ఇక్కడుంటే పోలీసోండ్లు తరుముకొస్తరు" అన్నాడు రిక్షా ఆయన భయపెడుతోన్నట్లుగా. నర్సిరెడ్డి పదమన్నాడు చేసేది లేక.

ఖాళీ రోడ్డుమీద ఐదు నిమిషాల్లో రిక్షా హాస్పటల్‌కు చేరింది. "ఇక్కడ కూడా పోలీసులు మస్తుగున్నారే!" అన్నాడు నర్సిరెడ్డి రిక్షా దిగి పైసలిస్తో.

"ఔను సారు. ఇక్కడనే కదా కొట్లాటయింది. అమ్మో ఏం రాళ్ళిసురుకున్రు! పోలీసోన్లకు కూడా దెబ్బలు తాకినయి. అందుకే దవాఖానలోకి పోయాడు. ఆయన్ను అడ్డుకునే వాళ్ళెవరూ లేరక్కడ. ఉద్యోగస్తులు అందరు స్ట్రైకులో ఉన్నారు. కొన్ని బెడ్లపై పేషంట్లున్నారు. ఖాళీగా ఉన్న వాటిపై పేషంట్ల బంధువులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. రెండు గదులు దాటుకు వెళితే సిద్దప్ప కనపడ్డాడు. సరస్వతమ్మ మంచానికంటుకుపోయిన బల్లిలా ఉంది. పక్క బెడ్డుమీద సిద్దప్ప, కూతురు ముత్యాలుతో కూర్చుని ఉన్నాడు. ఆయన గడ్డం మాసి, బట్టలు నలిగి ముష్టివాని లెక్కనున్నాడు. ముత్యాలు కూడా రెండు రోజుల నుండి ఏమీ తిననట్టే కనపడుతోంది.

నర్సిరెడ్డిని చూసి సిద్దప్ప మంచం దిగి ఆయన భుజంపై వాలి వలవల ఏడ్చేసాడు. "ఏం కష్టమొచ్చింది పటేలు. ఈ తిప్పలు నేను ఎన్నడూ ఎరగను. నా భార్య బతికి బట్టకడుద్దో లేదో తెల్వదు. ఎగుసం ఏమవుద్దో తెల్వదు. పిల్లగాడు ఏమైనాడో తెల్వదు. నాలుగు ముద్దలు తిని ఇస్కూలుకు పోయే పిల్ల ముత్యాళు దవాఖానలో గిట్ల నాతోటి పిచ్చిదాన్లెక్కన కూర్చున్నది. ఆమె ఆరోగ్యం బాగుపడేదెప్పటికో, మేం ఇంటికి పోయేదెప్పుడో. ఒక్క గోలీ లేదు, సూది మందు లేదు, డాక్టరు లేడు. రాత్రికి రాత్రే నువ్వు బండికట్టి తోల్తివి. ప్రాణాలు అరచేతల వెట్టుకుని వస్తిమి. డాక్టర్లు స్ట్రైకెపుడు నిలుపుతరో, వైద్యమెప్పటికి చేస్తరో తెల్వకున్నది. మంచం మీద ఆయమ్మి స్పృహల లేదు. ఆమెను చూస్తూ మేమిట్లా కూర్చుంటిమి"

"డాక్టర్లు పని చెయ్యడం లేదని తెలిసే నే వచ్చినా. ఏసుపాదం చెప్పిండు, నిన్న దవాఖానల లొల్లి జరిగినప్పుడు నీ కొడుకు ఈడ్నే ఉంటినట. నిన్ను కలిసనాడా లేదా?"

"నిన్న ఇక్కడ సంద్రం లెక్కన జనం ఉంటిరి. వాళ్ళలో మా రంగప్ప ఏడనో నేను చూడలే. వాడూ మాతానకు రాలేదు. ఎంత పనైంది పటేలు. అబ్బాయి ఇక్కడకొచ్చి చూడకుండ పోయినాడు. వాడుంటే నాకింత కష్టముండేడిది కాదు."

"నిన్న రాత్రి కూడా రాలేదా?"

"వస్తే చెప్పనా"

"నర్సిరెడ్డికి అర్థం కాలేదు. 'హాస్టల్ల ఏందో గడబిడయింది.' అనుకున్నాడు మనసులో. "పద ప్రైవేటు హాస్పటల్ కు పోదాము. డాక్టర్ల స్ట్రైకు ఎన్ని దినాలు నడుస్తాదో తెల్వదు. ఇక్కడ్నే కూర్చుంటే ఆమె పానాలను మనం తీసినవాళ్ళమవుతాం."

"పటేల్ ప్రైవేట్ హాస్పటలంటే మాటలా! ఎన్ని పైసలు గుంజుతరో నా తాన లెవ్వు. ఎగుసంలో పెట్టిన పైసలు పొలంలోనే నేలపై పోసొచ్చిన. ఇప్పుడేడనుండి తేను? బతుకుడో సచ్చుడో ఈడ్నే ఉంచుతా."

"నువ్వట్లంటవని తెలుసు సిద్దప్ప. పైసలకు ఫికరు లేదు. నే దెచ్చినా. పట్టు ఆమెను మనిద్దరం లేపుదాం. ఎవరితోనైనా చెప్పి రావాల్నా?"

"వాళ్ళు తీస్కపొమ్మని నిన్ననే చెప్పినారు. దవాఖానాలో ఊడ్చేవాళ్ళు తప్ప ఎవ్వరు లేరు."

నర్సిరెడ్డి బయటకు వచ్చి రిక్షావాడిని గేటు వద్ద నిలిపి వచ్చాడు. ఇద్దరూ సరస్వతమ్మను నడుము, కాళ్ళు పటుకుని బయిటకు తిసుకు వచ్చారు.

"ఏంది సారు, ఇంతమంది వచ్చారు. నా రిక్షాలాగదు" అన్నాడు కంగారుగా రిక్షా ఆయన.

"ఇద్దర్ని ఎక్కించుకో, ఇద్దరం నడిచొస్తాం. ఏదైనా మంచి ఆసుపత్రికి తీసుకపో"

"చాలా కష్టం. పోలీసోండ్లు అడ్డుపడతారు సారు. పైసలెక్కువవుతాయి"

"ఆ ముచ్చట చెప్పరాదూ. నీ కష్టానికి తగ్గ పైసలిస్తను. పోలీసోండ్లు అడ్డకుండ నే జూస్కుంట. పేషంటుని ఎట్లడ్డుకుంటరు?" నర్సిరెడ్డి మాట్లాడుతూనే సరస్వతమ్మను రిక్షాపైకి చేర్చాడు. సిద్దప్పను రిక్షా ఎక్కించి ఆయన కూతురుతో తను నడక సాగించాడు. రెండు వీధులు మలుపు తిరగగానే దేవా నర్సింగ్ హోమ్" పేరుతో ప్రైవేటు హాస్పటల్ దర్శనమిచ్చింది.

పేషెంటు ఎడ్మిషన్‌కు ఐదువేలు ఖర్చు అయింది. మరో ఐదువేలు సిద్దప్ప చేతిలో ఉంచి "రేపు నేను మళ్ళీ పైసలు పంపుతా. వైద్యం ఆపు చేయించకు. డాక్టరుతో మాట్లాడి వెళ్తా" అన్నాడు నర్సిరెడ్డి.

నర్సిరెడ్డి చేతుల్ని కళ్ళకద్దుకున్నాడు సిద్దప్ప. "మన గ్రామానికి దేవుడవు పటేలు. నీ బాకీ కాళ్ళు చేతులు కూడగట్టుకున్నాకా తీర్చుకుమాను. ఇంకొక్క ఉపకారం చేసిపెట్టు. నా కొడుకు ఎక్కడున్నాడో పట్టుకో. గణేష్ సంగతి తెల్సినంక మా ఇంటామెకు కాలు చేతులు వడ్డవి. నా కొడుక్కేమయిన అవుతె ఎట్లుంటదో అని దిగులుగున్నది."

"అరే ఏం కాదులే.. అందరూ మంచిగున్నరు. నీ కొడుకుతో మా మహేందర్ రెడ్డున్నడు, సురేషున్నడు. నేను వాళ్ళ తానకు పోయిన తరువాతే ఇంటికి పోతా. మీ చెప్పి పంపిస్త సరేనా." అంటూ అటునుండే డాక్టరు రూంలోకి పోయి మాట్లడి రోడ్డుమీదకు వచ్చాడు. రిక్షావాడు ఇంకా అక్కడే ఉన్నాడు. నర్సిరెడ్డి మరో సవారీ బేరం ఇస్తాడని ఎదురుచూస్తున్నాడు.

వాడూహించినట్లుగా నర్సిరెడ్డి వచ్చి రిక్షా ఎక్కి కాలేజీ హాస్టల్ దగ్గరకు పోనివ్వమని చెప్పాడు. రిక్షావాడు ఈసారి బేరం ఆడలేదు. పెద్దమనిషి అడిగినంత ఇస్తాడని నమ్మకం వచ్చింది. ఐదు నిమిషాల్లో హాస్టల్ ముందు నిలిపాడు. నర్సిరెడ్డి మెట్లెక్కగానే మూసివున్న ఆఫీస్ దర్శనమిచ్చింది. అక్కడున్న వాచ్‌మాన్ చెప్పాడు నిన్న అర్ధరాత్రి పోలీస్ రైడింగయి చాలామంది స్టూడెంట్లను తీసుకుపోయారని. ఉదయం కాలేజీ, హాస్టలు మూసివేస్తోన్నట్లు ప్రిన్సిపాల్ డిక్లేర్ చేసార్ట.

నర్సిరెడ్డికి కాళ్ళు దడదడలాడాయి. "పోలీసులు ఎవర్ని తీసుకుపోయారో చెప్పగలవా?" అన్నాడు బతిమాలుతున్న ధోరణిలో.

"మీ పిల్లల పేర్లు చెప్పండి. తెలిస్తే చెబుతాను"

"మహేందర్ రెడ్డి, రంగప్ప డిగ్రీ ఫైనలియర్ స్టూడెంట్లు, రూం నంబరు 40, నీకు తెలుసా?"

"వాళ్ళు లీడర్లు కదా, అందరికీ తెలుసు. రాత్రి పోలీసులు తీసుకు పోయినవాళ్ళలో ఇద్దరూ ఉన్నారు. ముందు వాళ్ళనే వేన్ ఎక్కించింది."

నర్సిరెడ్డి వడివడిగా హాస్టలు మెట్లు దిగి రిక్షా ఎక్కి పోలీస్ స్టేషన్‌కి పోనివ్వమన్నాడు.

"సారూ నామాటేంటి?"

నర్సిరెడ్డి వంద నోటు వాని చేతుల్లో పెట్టి "ఇంక నన్ను అడగమాకు. పోలీస్టేషన్ల దించు, పదినిమిషాలాగినంక ఎం.ఎల్.ఏ ఇంటితాన దింపి నీ దార్న నువ్వు పో. ఆడనుండి నా బాదలు నే వడ్తా."

రిక్షా సవారీ కదిలింది. పోలీస్ స్టేషన్ రాగానే కిందికి ఉరికాడు నర్సిరెడ్డి. లోపలకు పోయి ఆఫీస్ గదులు చుసాడు తనకు తెలిసిన పోలిసులుంటారేమోనని. ఎస్.ఐ కనపడి "నమస్తే పటేల్" అని పలకరించాడు.

"సారు, నీతో పనిబడి వచ్చినా మా పిల్లల్ని రాత్రి అరస్టు చేసి తీసుకొచ్చినట. ఏడుండారు?"

"భయంలే. రెండు రోజుల్ల వదులుతారులే. కలక్టరు వాళ్లను ముసి లోపలుంచమన్నాడు. ఇంక గొడవ పెరిగేట్లున్నదని అరెస్టు చేసినం. చూస్తావా?" అంటూ లోపల సెల్ దగ్గరకు తీసుకువెళ్ళాడు.

సెల్లులో పదిమంది పైనే పిల్లలున్నారు. అందరూ హుషారుగా కబుర్లు చెప్పుకుంటున్నారు. తండ్రిని చూడగానే మహేంద్ర రెడ్డికి చిరుకోపం వచ్చింది. "ఏంటి బాపు, నువ్వొచ్చినావు? వీళ్ళు అరెస్టు చేస్తే భయపడతామనుకుంటున్నారు పోలీసులు. ఇవన్నీ బెదరింపులు బాపు. వీళ్ళు నీ దగ్గర పైసలు గుంజతరేమో. ఎవ్వనికి ఇవ్వమాక. కాసేపాగితే మా స్టూడెంట్లు జులూస్ చేసి పోలీస్ స్టేషన్ని, కలక్టరేటుని ముట్టడిస్తారు."

కొడుక్కి ధైర్యం చెప్పి విడిపించే ప్రయత్నం చెయ్యడానికొచ్చిన నర్సిరెడ్డి తెల్లబోయాడు. "మీరు జైల్లో కూర్చుంటే మేం ఇంట్ల ఎట్టుంటాం? అసలు బయిట ఏం జరుగుతోందో మీకు తెలుస్తోందా? ఒరే రంగప్పా ఇట్ల ముంగలకు రారా. మీ యమ్మ సంగతి చెప్పిండా లేదా మా వాడు?"

"మా యమ్మ కేమయిందంకుల్?" అంటూ గుమ్మం చువ్వలు దగ్గరకు వచ్చాడు రంగప్ప. నర్సిరెడ్డి కొన్ని క్షణాలు ఏం మాట్లాడలేకపోయాడు. రాత్రి అంతేసేపు ఫోనులో మొత్తుకున్నది వృధా అయినందుకు బాధపడ్డాడు.

"అంకుల్, చెప్పండంకుల్. ఏమయింది?"

నర్సిరెడ్డికి ఎక్కడలేని కోపం వచ్చింది. "కలక్టరు మీద, నాయకులమీద, మీకు తోచిన తానల్లా రాళ్ళేసి రండ్రి. మీకు టైం దొరికితే మీ అమ్మ నాయన్ల సంగతి ముచ్చటించుకుందాం."

ఎస్సై పక్కనే ఉన్నాడు. "ఈయన డాక్టర్ను రాయిబెడ్డ పెట్టి కొట్టిండు. టీవీల ఆ క్లిప్పింగొచ్చింది. ఎవర్నొదిల్నా వీన్ని వదిలిపెట్టుడి కష్టం"

"సారు అట్టా మాట్లాడమాకు. మనందరం ఒకటి. మా పోరాటం మీ గురించి కాదా. మీ కష్టాలు కూడా మా డిమాండ్ల వెట్టినం. మీరు మమ్మల్ని సపోర్టు చెయ్యాలి." అన్నాడు మరో కుర్రాడు.

నర్సిరెడ్డి కోపం తారా స్థాయికి చేరుకుంది. "మీ అందరి అమ్మానాన్నల కష్టాలు కూడా డిమాండ్ల వెట్టండి. నాకొడుకు ఫెయిలవుతాడన్న బాధ నాకు లేదు, అరస్టయినందుకు బాధలేదు. నాకు వెయ్యేకరాల జమీనుంది మినిష్టర్ల అండ ఉంది. అట్లనే నీకు నీ బాపు సంపాదించి పెట్టుండు. మా ఊరి గణేషు పానాలు తీస్కుంటే మీరందరూ చూస్తూ ఎట్లుంటిరి? మీ డిమాండ్ల వెట్టి వాని పానాలు వెనక్కు తీసుక రండ్రి. వీని అమ్మ కాలు చేతులు పడి ఆస్పత్రిల సవ్వడానికి సిద్దంగున్నది. ఇంట్ల పైసాలేక, గవర్నమెటు ఆస్పత్రిల డాక్టర్లు లేక భార్యను కళ్ళముందే చంపుకుందుకు సిద్దమయిండు వీన్నయన. ఏం డాక్టర్ను నువ్వేగా రాయిచ్చుకుని కొట్టినావు? పోలీసోండులు నీకు సపోర్టు చెయ్యాలా? నువ్వు విసిరిన రాయి ఆయనకు తగల్లేదురా. నీ తల్లి కాలు చేతులకు తగిలింది, మెదడుకు తగిలింది. గావ్ పెద్దమనిషిని గాబటి, మంచి మనసున్నోణ్ణి గాబట్టి ప్రైవేటు దవాఖానలో చేర్పిస్తిని. నిన్నటినుండి నీకోసం కలవరిస్తున్నడు మీ నాయిన. రాళ్ళిచ్చుకుని దవాఖాన చుట్టు తిరిగితివి కానీ లోపలున్న మీ అమ్మనాయన్లు అగపడలేదు."

రంగప్ప కంట్లో నీళ్ళు తిరిగాయి. "ఏం రెడ్డి? చెప్పలేదురా నాకు?" అన్నాడు స్నేహితుడితో బాధగా.

మహేందర్ రెడ్డి తలొంచుకున్నాడు. రంగప్ప స్నేహితుని కాలరు పట్టుకుని గుంజాడు, "మాట్లాడవేమిరా!"

"వాడు నీ జిగినీ దోస్త్. ఏం మాట్లాడతాడు. నిన్న ఒక స్నేహితుని బొందల్ల వెట్టడానికొచ్చారు జేజేలు కొట్టుకుంటూ. ఒక్కరైన ఇళ్ళకు బోయినారా? అమ్మ, అక్క, చెల్లెలు ఎవరెట్లుంటిరో చూస్తిరా? నల్లయ్య చెప్పబోతే వాన్ని కసిరి గొడ్తిరి. నిన్ను దవాఖానకు తోల్కుపోరా బిడ్డా అని నెత్తి నోరు కొట్టుకుని సెప్తె మాటమాత్రం చెప్పలా."

"నేను చెప్పాలనుకుంటిని బాపు. అప్పటికే పోలీసులు హాస్టలు చుట్టుముట్టినరు. ఏం చెయ్యలేక గమ్మునుంటిని. నువ్వు కంగారు పడతవని నీకు చెప్పలేదు. "సంజాయిషీ ఇచ్చుకున్నడు మహేందర్ రెడ్డి. "బాపూ వీన్నెట్లయిన బయిటికి పంపించు."

నర్సిరెడ్డి పోలీస్ స్టేషన్ బయటకు వచ్చాడు. "ఎం.ఎల్.ఏ ఇంటికి తోలకపో" అన్నాడు రిక్షా ఎక్కి. మరో పదినిమిషాల్లో గమ్యం చేరింది రిక్షా. ఎం.ఎల్.ఏ సాంబురెడ్డి ఇంట్లో ఉన్నాడు. పోయిన ఎలక్షన్లో తన సాయం పొందినవాడు కాబట్టి చొరవగా ఇంట్లోకి వెళ్ళాడు నర్సిరెడ్డి. సాంబురెడ్డికి కొత్తగా సంగతి చెప్పేదేం లేదు. ఊర్లో జరుగుతోన్న గొడవ అంతా ఆయనకు తెలుసు.

"మీ వాండ్లకు కేసుల్లేకుండా పంపే జమ్మేదారి నాది నర్సిరెడ్డి. కాకపోతే రెండు రోజులు స్టేషన్ల ఉండాల. బయిట అల్లర్లు తగ్గేదాక ఓపిక పట్టాలి. అంతదాకా వాళ్ళను మంచిగ జూస్కోమని నేను చెపుతాను సరా. నా మాట మీద విశ్వాసం ఉంచు. చనిపోయిన మీ ఊర్ల కుర్రోని తాలుకోళ్ళకు సర్కారు ద్వారా పైసలిప్పించే జమ్మేదారి కూడా నాదే. నువ్వు నాకు పోయినెలక్షన్ల సహాయం చేసినావు. నేనెట్టా మరుస్తాను. నువ్వు బే ఫికరుగుండు."

నర్సిరెడ్డి రంగప్ప గురించి చెప్పాడు. "వాని తల్లి చావు బతుకుల మధ్యనుంది. వాన్ని వదిలే మార్గం చూడు."

"నువ్వే చెబుతుంటివి వాడు రాళ్ళు వెట్టి డాక్టర్ను కొట్టినట్టు రికార్డయిందని. కేసు బుక్కు అయినంక మెజిస్ట్రేట్ యాక్షను తీసుకుంటడు గదా? డాక్టర్ల చేత కేసు విత్ డ్రా చేపిస్తే బయటికొచ్చే దారుంటది. నేనుపోయి డాక్టర్లతో మాట్లాడతా. నువ్వు ఈడనే మా ఇంట్ల ఉండు. సమజయిందా?" అన్నాడు సాంబురెడ్డి.

నర్సిరెడ్డి చేసేదేం లేక తలూపాడు. సాంబురెడ్డి బయిటకు వెళ్ళాక ఇంటికి ఫోన్ చేసాడు. ఇక్కడ అంతా బాగానే ఉందని, తను ఒక దినం గడిచినాక వస్తానని. కొడుకు అరెష్టయిన సంగతి దాచిపెట్టాడు.

మధ్యాహ్నం సాంబురెడ్డి భార్య రాజమ్మ "అన్నా.. భోజనానికి రా" అని పిలిచి వడ్డించిద్మి. నర్సిరెడ్డికి తినబుద్ధికాలేదు. "రాజకీయాలన్నాక ఇట్లనే ఉంటివి. ఎందుకు ఫికరౌతవన్నా" అందామె. నర్సిరెడ్డి సాంబురెడ్డికి దోస్తుకావడంతో ఆమెక్కూడా బాగా అలవాటైన మనిషిగా మాట్లాడుతుంది.

"లేదు చెల్లమ్మా మా వానికేం కాదులే. సాంబిరెడ్డికి చెప్పినంకా నాకు మస్తు నమ్మకముంటది. నేను ఊర్ల సంగతి సోచాయిస్తుండా. ఏందో రెండు దినాల్నుంచి అంతా గడబిడయినాది. ఈడ్న ఉండాల్నా! గామ్ పోవాల్నా! ఎం చేసేటిదో తెల్వట్లా"

రాజమ్మ కూర వడ్డిస్తూ మరో మాట వదిలింది. "మా రెడ్డి చెప్పిండు, మీ మహేందర్ రెడ్డి పెద్ద లీడర్లెక్కన ఎదిగన్నట. మొత్తం అన్ని కాలేజీల పిల్లల్ని ఒక్క మాటమీద నిలబెట్టిన్నట."

"ఆ నిలవెట్టిండు. అందర్ని నిలవెట్టి గణేషును మట్టిల కలపిండు" అన్నాడు నర్సిరెడ్డి కోపంగా.

"ఉద్యమం అన్నాక ఇట్లాంటివి గుజరాయిస్తాయి. ఆపితే ఆగేయిటివికావు. మీ వాన్ని చూస్తే మా రెడ్డికి చాలా ముచ్చటేస్తోంది. మీతో సంబంధం కలుపుకుందావంటున్నాడు."

నర్సిరెడ్డి ఆశ్చర్యపోయాడు. ఇప్పటివరకు ఉద్యమం పిల్లల చదువులు పాడుచేసింది, ప్రాణాలు తీసింది, జనాల్ని ఆస్పత్రుల పాలు చేసింది. ఇప్పుడు ఒక రాజకీయ నాయకునితో సంబంధం కుదురుస్తోంది.

"ఏమంటావన్నా?" అంటూ రాజమ్మ రెట్టించింది.

"మా సాంబురెడ్డి ముచ్చట పడుతోంటే నేనెందుకు కాదంటాను? ఇవాళ పిల్లనిస్తాడు, రేపు మినిష్టర్ని చేస్తాడు. వానికా దమ్ముంది" అన్నాడు నర్సిరెడ్డి సంతోషంగా. ఇప్పుడు రాజమ్మ కొసరి కొసరి వడ్డించింది. నర్సిరెడ్డి భోజనం కడుపునిండా తిన్నాడు.

చెయ్యి కడుక్కుంటూ చివరిగా అన్నాడు, "ముంగల ఈ గొడవలన్నీ చల్లార్నీ చెల్లమ్మా. ఆనక ఆరామ్‌గా మాట్లాడుకుందాం."

రాజమ్మ ఇంట్లోకి పోయి వెంటనే సాంబురెడ్డికి ఫోను కలిపింది.

●●●

**"హోం మినిష్టరుతానున్నా. ఏంది జల్దీ చెప్పు."** అన్నాడు సాంబురెడ్డి.

"మా అన్నతో పెండ్లి ముచ్చట కలిపినా, ఆయనిష్టంగున్నడు. మహేందర్ రెడ్డి మన అల్లుడైనట్టే!" అంది అత్యుత్సాహంతో రాజమ్మ.

"అయితే ఇంకేంది రాజీ! నేన్జూసుకుంటాలే, వాని సంగతి. ఇప్పుడే మినిష్టర్తో మాట్లాడుతున్నా" అంటూ ఫోన్ కట్ చేసాడు సాంబురెడ్డి.

రాజమ్మ గదిలోకి వెళ్ళినంత వేగంగా తిరిగి నర్సిరెడ్డి ఉన్న చోటికి వచ్చింది. "ఆయన హోం మినిష్టరు తానకు పోయిండు అన్నా. అన్నీ మాట్లాడుతుండు."

"నేను సాంబురెడ్డిని నమ్ముకొచ్చినా, ఆయన ఉపకారం చేస్తడని. మాట నిలబెట్టుకుంటుండు." అన్నాడు సంతోషంగా నర్సిరెడ్డి. "గట్లనే ఆ గణేష్ నాయన్కి జల్దీ పైసలిప్పించే పనిగూడ చూడమని చెప్పు చెల్లమ్మా. గావ్‌ల ఇది మన ఇజ్జత్ నిలవెడ్తది."

రాజమ్మ తిరిగి లోపలకు పోయింది. రెండు నిముషాల తరువాత నర్సిరెడ్డి అనుకున్నాడు. 'చెల్లమ్మ చెప్పుంటాది, సాంబు రెడ్డి మినిష్టరుతో మాట్లాడుతా ఉంటడు. పనైపోయే ఉంటాది.'

నర్సిరెడ్డికి చిన్నగా కునుకు పట్టింది. మెలుకువ వచ్చే సరికి మూడు గంటలయింది. వాష్ బేసిన్ దగ్గర మొహం కడుక్కుని వచ్చి హాల్లో సోఫాలో చతికిలపడ్డాడు. రాజమ్మ టీ పట్టుకు వచ్చి తను కూడా కూర్చుని టి.వి.ఆన్ చేసింది. ఫ్లాష్ న్యూస్ అంటూ ఎనౌన్స్‌మెంట్ వచ్చింది, "విద్యార్థులు బే షరతుగా, జరిగిన అనర్థానికి విచారం వ్యక్తం చేస్తూ క్షమార్పణలు కోరారు. ఇరువర్గాల మధ్య రాజీ కుదరడంతో డాక్టర్లు సమ్మె విరమించారు. విద్యార్థులపై కేసును ఉపసంహరించుకున్నారు."

నర్సిరెడ్డి వెంటనే సాంబురెడ్డికి ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. వచ్చిన పనయినందుకు సంతోషంగా రాజమ్మతో "పనయింది గదా, వస్తాను చెల్లమ్మ. ఇంటికి పోయి మీ వదినతో కూడా ఒక మాట చెప్పాలిగదా. ఒకసారి హాస్పటలకు పోయి మా ఊరిపోళ్ళను చూసి అట్లనే ఊరుబోతా." అంటూ లేచాడు.

"కారులోపో అన్నా. ఊర్ల నీ పన్జూసుకుని, ఇంటికి పోయినంక కారును పంపించు. ఏంతొందరలే" రాజమ్మ కారు డ్రైవర్ని పిలిచి చెప్పింది. నర్సిరెడ్డి కాదనలేదు.

●●●

నర్సిరెడ్డి పట్నం నుండి తిరిగి వచ్చి వారం రోజులయింది. ఈ వారం రోజుల్లో బందులు, హర్తాళ్ళు అన్నీ రాష్ట్రంలో ముగిసాయి. సర్కారు ఒక మెట్టు దిగొచ్చి స్టూడెంట్ల డిమాండ్లలో కొన్ని అంగీకరించింది, మరికొన్ని పరిశీలనలోకి తీసుకుంది. గణేష్ నాయన యాదగిరికి ఐదు లక్షల పరిహారాన్ని కూడా ప్రకటించింది. చెక్కును ఇవ్వడానికి నియోజక వర్గం ఎం.ఎల్.ఏ, హోం మినిష్టరు గ్రామానికి వచ్చేందుకు ప్రోగ్రామ్ నిర్ణయించారు. ఆ ప్రోగ్రామ్‌లో మరో విశేషం ఉంది. ఎం.ఎల్.ఏ సాంబు రెడ్డి కూతురు సరితకు పటేల్ నర్సిరెడ్డి కొడుకు మహేందర్ రెడ్డికి పెళ్ళి నిశ్చయ తాంబూలాలు కూడా అదే రోజు.

ఉదయం ఎనిమిదిగంటలకే పోలీస్ జీపు వచ్చి నర్సిరెడ్డి ఇంటిముందు వాలింది నర్సిరెడ్డి బయటకు రాగానే ఎస్.ఐ, సెల్యూట్ చేసాడు. "పటేల్ సాబ్ బాగుండారా. ఉర్ల మీటింగ్ అరేంజ్ మెంట్లు చూస్త ఒక రౌండ్ మీ ఇంటి వరకూ వచ్చినా" అన్నాడు వినయంగా.

"మంచిది. వచ్చేది హోం మినిష్టరు గదా. జర్ర మంచిగ చూసుకోండి." అన్నాడు నర్సిరెడ్డి నవ్వుతూ చెయ్యి కలిపి, మరోసారి సెల్యూట్ చేసి జీపులో వెళ్ళిపోయాడు ఎస్.ఐ.

నర్సిరెడ్డి కూడా తయారై గ్రామ చావిడి దగ్గరకు వచ్చాడు. అప్పుడే వచ్చిన గ్రామీణ బస్సులోంచి సిద్దప్ప దిగడం చూసి దగ్గరగా వెళ్ళాడు. కొడుకు కూతురు సాయం పట్టి సరస్వతమ్మను కిందకు దింపారు. వాళ్ళ వెనుకనే నల్లయ్య కొడుకు సురేష్ కూడా సామాన్లు పట్టుకుని దిగాడు. సరస్వతమ్మ కాలు, చెయ్యి బాగుపడలేదు. మూతి వంకర కొంచెం తగ్గింది.

బండిని తోలుకు రమ్మని లచ్చుమయ్యతో ఇంటికి కబురు పంపి, "ఏమన్నారు డాక్టర్లు?" అని అడిగాడు నర్సిరెడ్డి.

"పెద్ద ప్రమాదం తప్పింది పటేలు. బ్రెయిన్ హెమరేజ్ అయ్యేదట. నా అదృష్టం బాగుండి ఇక్కడితో సరిపోయింది. గావ్‌ల ఎట్లుంది?"

"పోయిందేదో పోయింది సిద్దప్పా, మీ ఇంటామెను బతికించుకుని వచ్చావు. అది చాలు."

సిద్దప్పకు అనుమానం వచ్చింది. "ఎట్లుంది నా పొలం? పనలు ఇంకా నేలమీద దొర్లాడుతున్నాయా?"

"నీకు నేను తోడున్నాను. భయపడకు సిద్దప్పా. మనకు అదృష్టం లేనప్పుడు మట్టిలోది మట్టిలో కలుస్తాది."

"ఏమయింది?"

నర్సిరెడ్డి నిజం దాచలేకపోయాడు. "ఒక్క రెండు రోజులు ముందుగా నువ్వు తిరిగొచ్చుంటే ఇలా జరిగేది కాదు. నేనైతే కుప్ప పెట్టించినా. పెద్దగా గాలివాన వచ్చి గడ్డి ఎగిరిపోయింది. పోతే పోయిందిలే. మీరు మంచిగా తిరిగొచ్చినారు, చాలు. మూడు మాసాలు ఓపిక పడితే మరో పంట చేతికొస్తుంది."

"నువ్వు బాధపడకు నాయనా నేను ఇకనుంచి ఎగుసం చూసుకుంటా" అన్నాడు రంగప్ప.

సిద్దప్ప కొడుకు మొహంలోకి ఆశ్చర్యంగా చూసాడు. అంతే ఆశ్చర్యం కలిగింది నర్సిరెడ్డికి కూడా.

"ఏమిరా అట్లా అంటావు? ఇంక ఒక సంవత్సరం చదవాలి, పరీక్షలు రాయాలి, అప్పటిగ్గాని డిగ్రీ చేతికి రాదు." అన్నాడు నర్సిరెడ్డి.

రంగప్ప తలవంచుకున్నాడు. "లేదంకుల్ నేను ఎగుసం చూస్కోవాలని డిసైడ్ చేస్కున్నా."

సురేష్ కూడా అదే మాటన్నాడు. "మా నాయన కూడా వచ్చెయ్యమంటుడు అంకుల్ వ్యాపారం చూసుకోవడాన్కి. నేగూడ అట్లనే డిసైడయినా."

నర్సిరెడ్డి ఇద్దరి భుజం మీద చెయ్యేసి మందలింపుగా చెప్పాడు. "ఉద్యమం అడ్డదార్లు పడితే మీమీద ఆధారపడే వాళ్ళ బతుకులేమౌతాయో తెలుసుకున్నారు. మీరు అంత మాత్రం తెలివిగా ఉంటే చాలు, చదువులూ మానక్కర్లే, ఉద్యమాలు మానక్కర్లే. దేనిదారదే బిడ్డా. మీ యువత చేతులు ముడుచుకు కూర్చుంటే దేశమేమౌతాది? బాగా చదువుకోండి, మంచిగ పైకి రండి. గణేష్‌లు కాకండి."

ఏసుపాదం బండి తీసుకొచ్చాడు. సరస్వతమ్మను బండిమీద కూర్చోబెట్టి పోనిచ్చారు. కుర్రాళ్ళు మారినారు అనుకున్నాడు నర్సిరెడ్డి.

శంకరయ్య పరుగులాంటి నడకతో వచ్చాడు.

"ఏందయ్యా గట్ల వగరుస్తున్నావు?"

"పటేల్ దొర నువ్వు జల్ది రావాల్నె. యాదగిరి తల కొయ్యకేసి బాదుకుంటుండు. నేనాపలేను దొర. వాడు రక్తాలు కారి సచ్చేటట్లున్నడు."

ఎందుకు? ఏమిటి? అని అడిగే ఆలోచన మానుకుని నర్సిరెడ్డి పరుగెట్టాడు. రావి చెట్టు కింద యాదగిరి పొర్లుతున్నాడు. తలకు పెద్ద గాయమయి రక్తం కారుతోంటే తన కండువాని తీసి కట్టు కట్టాడు నర్సిరెడ్డి.

"ఏమయిందిరా యాదగిరి, గిట్ల తల బాదుకుంటివి? నీ కోసం హోం మినిష్టరొస్తున్నడు. మంచి పైసలు ముట్టచెప్తాడు. ఈ టైంల గిట్ల చేస్తే ఏం మంచిగుంటది చెప్పు."

యాదగిరి మాట పలుకు లేకుండా ఇంటివైపు వెర్రి చూపులు చూస్తున్నాడు. నర్సిరెడ్డికి అనుమానం వచ్చి లోపలికి పోయి చూసాడు. ఎంకటమ్మ శరీరం సగం మంచానికి అడ్డంగా నేలపై వాలి ఉంది. వంటిపై చెయ్యి వేసి చూసాడు. చల్లగా ఉంది. ప్రాణం గాల్లో కలిసింది.

శంకరయ్య అందర్నీ పిలుచుకొచ్చాడు. ఎంకటమ్మ శరీరం చెట్టుకిందకు చేరింది. యాదగిరి పిచ్చి చూపులు చూస్తూ చెట్టు చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నాడు. ఎగురుతూ కొమ్మల్ని పట్టుకుని వేలాడుతున్నాడు.

ఊర్లో వాళ్ళకు పని మొదలయింది. ఎంకటమ్మ బంధువులకు కబురెళ్ళింది. దండోడాళ్ళకు కబురు తెలిసింది. కట్టెలు శ్మశానం చేరాయి. ఎంకటమ్మ కట్టెను మోసేందుకు నలుగుతు మనుషుల్ని కుదిర్చారు. నర్సిరెడ్డి దండలు, బుక్క గులాలు తెప్పించలేదు. ఆమె తల దగ్గర దీపం కూడా పెట్టలేదు.

"ఇంటి దీపం ఆరిపోయినాది, ఇంటాయనకు పిచ్చి పట్టినాది. ఇక దేనికి దీపం!" అన్నారందరూ.

రెండు గంటల వ్యవధిలో ఎంకటమ్మ పాడెమీదకెక్కి భుజాలు మారుతూ శ్మశానం దారి పట్టింది. దండోడోళ్ళ డప్పులకు లయబద్ధంగా నాట్యం చేస్తూ తనకు తెలియకుండానే వెంటబడ్డాడు యాదగిరి.

రోడ్డు మీద హోం మినిస్టరు కాన్వాయ్ ఎదురుపడింది. మినిష్టరు, ఎం.ఎల్.ఏ, కలక్టరు, అనుచరగణాల కార్లు ఆగాయి. శ్మశానంకు అనుసరించారు అందరూ. ఎంకటమ్మ క్షణాల్లో బుగ్గి అయిపోసాగింది.

"సో.. ప్రోగ్రాం ఇవాళ కాన్సిల్ అయినట్టేగా?" అడిగారు మినిష్టరుగారు.

"కాన్సిలే సార్. ఈ చెక్ అందుకోవడానికి ఆ ఇంటి వాళ్ళు ఎవరూ లేరిప్పుడు. తండ్రి మెంటల్ స్టేటస్ సరిగ్గా లేనప్పుడు ఈ చెక్‌ను పెండింగులో పెట్టడం తప్ప మరేం చెయ్యలేం" అన్నారు కలక్టరుగారు.

"సాంబురెడ్డి, నీ సంగతేమిటి?"

సాంబురెడ్డి కాబోయే వియ్యంకుని చెవిలో గుసగుసలాడి వచ్చి చెప్పాడు, "మా ఫంక్షను మరో రోజుకు మార్చుకుంటున్నాం సార్. ఈసారి మా ఇంటిదగ్గర తాంబూలాలు ఏర్పాట్లు చేస్తాను. పోదాం రండి."

కార్లు పట్నం వైపు తిరిగిపోయాయి. ఊరి జనం నిశ్శబ్దంగా గ్రామం వైపు అడుగులు వేసారు. శ్మశానంలో ఉన్న పెద్ద మర్రి చెట్టు నిండా ఉన్న కాకులు గోలగోలగా అరుస్తున్నాయి. యాదగిరి వాటిపై రాళ్ళు విసురుతూ అక్కడినుండి తిరిగిరాలేదు.

●●●

-సమాప్తం-